ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5 మంగళవారం 27 ఫిబ్రవరి 2024











ప్రమాదంలో మృతి చెందిన అన్నదమ్ములు ప్రసాద్, కిషోర్ నాగయ్య (ఫైల్)

దూసుకొచ్చిన.. మృత్యువు

- కాకినాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన ముగ్గురు డ్రైవర్లు...
- వీరిలో ఇద్దరు అన్నదమ్ములు

బల్లికురవ, ప్రత్తిపాడు(కాకినాడ), ఫిబ్రవరి 26: పంక్చర్ అయిన లారీ టైరు మారుస్తున్న డ్రైవర్లపై మృత్యుశకటంలా ఆర్టీసీ బస్సు దూసుకువచ్చింది. ఈ ఘటనలో ముగ్గురు డ్రైవర్లు ప్రాణాలు కోల్పోగా అమ్మవారి ఆలయ సేవకుడు కూడా మృత్యువాతకు గురయ్యాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపంలో పాదాలమ్మ గుడి వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున జరిగింది.

వివరాల్లోకి వెళితే.. బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడుకు చెందిన దాసరి ప్రసాద్ (45), దాసరి కిషోర్(40) అన్నదమ్ములు. వారిద్దరూ లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వారం క్రితం రెండు లారీలకు బాడుగకు వెళ్లారు. వీరితోపాటు ఎస్సీ కాలనీకి చెందిన బండి నాగయ్య(24) అనే మరో డ్రైవర్ కూడా వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున వారు తీసుకెళ్లిన ఒక లారీకి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవే రోడ్డుపై టైరు పంక్చర్ కావటంతో ముగ్గురు టైర్లు మార్చుతున్నారు. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వారిపై వెళ్లింది. అదే క్రమంలో పాదాలమ్మ ఆలయం వద్దగల షెల్టర్ నుంచి బహిర్భూమికి వెళ్తున్న ఆలయ సేవకుడు దివిలి లోవరాజు(29)ను కూడా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు డ్రైవర్లు, ఆలయ సేవకుడు తీవ్ర గాయాలతో సంఘటనాస్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన ఆర్టీసీ బస్సును డ్రైవర్ నిలుపుదల చేయకుండా రాజమహేంద్రవరం తీసుకు వెళ్లిపోయాడు. బస్సు లో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటనపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ నిర్వహించారు. నాలుగు మృతదేహాలను ఆటోలపై స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి మృతుల బంధువులకు అప్పగించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే నక్కబొక్కలపాడు గ్రామం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. ఎంతో కాలం నుంచి అన్నదమ్ములు డ్రైవర్లగా పనిచేస్తున్నారని ఇలాంటి ప్రమాదం జరగుతుందని కలలో కూడా ఊహించ లేదని వారి బంధువులు అంటున్నారు. వెంటనే వారి బంధువులు ఘటనా స్థలికి తరలివెళ్లారు.



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఇదే

సోదరులిద్దరూ కలిసే వెళ్లారు..

దాసరి ప్రసాద్, దాసరి కిషోర్ కొంత కాలం నుంచి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇద్దరికి వివాహాలయ్యాయి. కిషోర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా, వారు ఆయనతో సంబంధం లేకుండా వేరే ప్రాంతంలో ఉంటున్నారు. ప్రసాద్‌కు భార్య వరలక్ష్మి, తొమ్మిది, పదో తరగతి చదువుతున్న కుమార్తెలు లక్ష్మీ కిరణాంజలి, లిఖిత ప్రసన్న ఉన్నారు. వీరు బల్లికురవ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఒకే ఇంట్లో అన్నదమ్ముళ్లు ప్రమాదంలో మృతి చెందిన వార్తవిని వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు.

కుమారుడిని సరిగా చూడకుండానే..

బండి నాగయ్య గతంలో వ్యవసాయ కూలీ పనులు చేసేవాడు. కొంతకాలం నుంచి లారీడ్రైవర్‌గా వెళుతున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగయ్యకు భార్య, రెండేళ్ల కుమార్తె ఉంది. 21 రోజుల క్రితం కుమారుడు జన్మించాడు. ఆదివారం రాత్రి భార్యకు ఫోను చేసి సోమవారం ఉదయం జరిగే కుమారుడి స్నానం ఫంక్షన్‌కు వస్తానని, చేయాల్సిన పనులన్నీ భార్యకు చెప్పాడు. తెల్లవారితే భర్త వస్తాడని ఎదురుచూస్తున్న భార్య లిల్లీరేస్‌కు ప్రమాదంతో భర్త మృతి చెందాడని తెలిసి బోరున విలపించింది. తన కుమారుడిని సరిగా చూసుకోకుండానే పరలోకానికి తన భర్త వెళ్లిపోయాడని ఆమె రోదనలు చూపరులను కంట తడి పెట్టించాయి.



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఆస్పత్రి వద్ద విషాదంలో మునిగిపోయిన మృతుల బంధువులు

సంక్షేమం సందేహం

- వాయిదాలతో లబ్ధిదారుల్లో ఆందోళన
- ఎన్నికల కోడ్ ముంచుకొస్తున్నా తాత్సారం
- నిరవధికంగా వాయిదా పడిన చేయూత పథకం
- అదే బాటలో విద్యాదీవెన, ఈబీసీ నేస్తం పథకాలు

చేయూత వాయిదా పడింది.. విద్యా దీవెన వాయిదా వేశారు.. ఈబీసీ నేస్తం ఇప్పుడు కాదంటున్నారు.. మొత్తంమీద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకుంటున్న సంక్షేమ పథకాల అమల్లో సందేహాలు నెలకొంటున్నాయి. ఆయా పథకాల నగదు ఎప్పుడు పడుతుందో.. అసలు పడుతుందా లేదా అనేది అనుమానంగా ఉంది. ఒక వైపు ఎన్నికల కోడ్ తరుముకొస్తుంటే, మరోవైపు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తేదీలను వాయిదా వేస్తూ వస్తోంది. తాజాగా ఈ నెల 26న అమలు చేస్తామని ప్రకటించిన వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. జగనన్న విద్యాదీవెన, ఈబీసీ నేస్తం పథకాలు కూడా అదే బాటలో ఉన్నాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళనలు నెలకొన్నాయి.

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత సంక్షేమ పథకాల అమలుకు ఎన్నికల సంఘం చెక్ పెడుతుంది. ఇదంతా తెలిసి కూడా ప్రభుత్వం సంక్షేమ పథకాలను వాయిదా వేస్తూ వస్తోంది. ఈ నెల 26న ప్రారంభం కావాల్సిన నాలుగో విడత చేయూత పథకాన్ని తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా చెప్పకుండా ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 2 లక్షల 70 వేల మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కావాలనే ఎన్నికల కోడ్ వచ్చే వరకు తాత్సారం చేస్తూ వస్తోందేమోనన్న అనుమానం లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతోంది.

వాయిదాల పర్వంతో వంచన

వాయిదా పద్ధతిని అనుసరిస్తూ ప్రభుత్వం ఆది నుంచి సంక్షేమ పథకాలను నీరుగారుస్తూ వస్తోంది. 2019 అధికారంలోకి వచ్చిన వెంటనే పథకంపై హడావుడి చేసిన ప్రభుత్వం 2020 ఆగస్టు 12 వరకూ ఆ పథకం ఊసే ఎత్తలేదు. అధికారం చేపట్టిన 14 నెలల వరకూ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనైనా ప్రారంభించలేదు. ఆ తర్వాత 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం మరో 16 నెలల తర్వాత 2022 సెప్టెంబరు 23న మూడో దఫా చేయూత అందించింది. మూడో దఫా చేయూత అంది ఇప్పటికి 16 నెలలు కావస్తున్నా నాలుగో దఫా చేయూత విడుదల చేయలేదు. కిందటేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ పథకాన్ని ప్రారంభించలేదు. తొలుత అక్టోబరులో అని, ఆ తర్వాత జనవరిలో అని, అటు పిమ్మట ఫిబ్రవరి చివర్లో అని, ఆఖరికి అది కూడా వాయిదా వేశారు. దీంతో లబ్ధిదారులు ఈసురోమంటున్నారు.


● ప్రకటనల్లోనే.. క్యాలెండరు

ప్రతి ఏటా సంక్షేమ క్యాలెండరు విడుదల చేస్తాం. ఆ ప్రకారం పథకాలను అమలు చేస్తాం అని బడాయి మాటలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో లబ్ధిదారులను అడుగడుగునా వంచించింది. ప్రతి ఏటా అమలు చేస్తానన్న పథకాలను వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ నెట్టుకొస్తోంది. ఐదేళ్ల పాలనలో ఒక్క సంక్షేమం కూడా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఐదేళ్లలో వైఎస్సార్ చేయూత నాలుగు దఫాలకు మూడు దఫాలు, అమ్మఒడి ఐదేళ్లకు నాలుగు దఫాలు మాత్రమే అమలు జరిగింది. ఆసరా పథకం నాలుగో దఫా బటన్ నొక్కినా ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బు మాత్రం జమకాలేదు. జగనన్న విద్యాదీవెన మూడు, నాలుగు దఫాలుగా విద్యార్థులకు దక్కడం లేదు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పరిస్థితి అంతే. ప్రభుత్వం ఏనాడో ప్రకటించాల్సిన ఈబీసీ నేస్తం, విద్యాదీవెన పథకాలను కూడా ఫిబ్రవరికి వాయిదా వేసింది. ఎన్నికల కోడ్ వచ్చే లోపు అవి కూడా అమలవుతాయో లేదో అనుమానమే.





ఇసుక దందా



టిప్పర్లకు ఇసుక నిప్పుతున్న ఎక్స్‌కవేటర్లు

- రోజు నాలుగు ఎక్స్‌కవేటర్లతో ఇసుక అక్రమ తవ్వకాలు
- సుమారు 250 టిప్పర్లు... 200 ట్రాక్టర్ల రవాణా
- రూ.కోటి విలువ ఉంటుందని అంచనా
- చినగంజాం, కడవకుదురు మధ్య ఆర్‌ఓబీ సమీపంలో దందా
- చినగంజాం మండలస్థాయి అధికారపార్టీ నేత హల్‌చల్
- ఎన్జీటీ ఉత్తర్వులు బేఖాతర్
- ప్రైవేటు సైన్యం... ప్రత్యేక నిఘా
- అందరికీ కనిపిస్తున్నా.. సెబ్, మైనింగ్ అధికారులకు కనిపించని వైనం

చీరాల, ఫిబ్రవరి 26: పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలంలోని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా రోజుకు సుమారు 250 టిప్పర్లు, 200 ట్రాక్టర్లు ఇసుక అక్రమంగా తరలుతోంది. రోజూ అక్రమంగా తరలే ఇసుక విలువ సుమారు రూ.కోటి ఉంటుందని అంచనా. అధికారపార్టీకి చెందిన మండలస్థాయి నేత ఈ దందాని కొనసాగిస్తున్నాడు. ఇతనికి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఓ మాజీమంత్రి, నియోజకవర్గ పార్టీ నేత అండదండలు ఉన్నాయని ప్రజలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు, రవాణా ఎక్కడో మారుమూలన జరగటం లేదు. 216 జాతీయ రహదారిలోని కడవకుదురు ఆర్‌ఓబీ సమీపంలో చినగంజాం, కడవకుదురు మధ్య రైల్వేట్రాక్‌కు తూర్పున జరుగుతుంది. ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ఉత్తర్వులను లెక్కచేయకుండా ఏకంగా నాలుగు ఎక్స్‌కవేటర్లతో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తుండటం వారి బరితెగింపునకు పరాకాష్ట. అయితే ఇవేవీ సెబ్, మైనింగ్ అధికారులకు కనిపించకపోవటం విశేషం.

ఏ భూమి అయినా..

చినగంజాం మండలంలో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేవు. అయితే ఆ మండల స్థాయి నేత కన్ను పడితే అది ప్రభుత్వ భూమి అయినా, పట్టా భూమి అయినా, అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు తెరతీస్తాడు. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ భూమిలో కూడా తన పొక్లయినర్లతో ఇసుక అక్రమ తవ్వకాలు సాగించటం అతని తెంపరితనానికి నిదర్శనం. సదరు మండల నేత తన ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం అందించిందేకు అన్ని శాఖల్లో వేగులను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. అలా అందిన సమాచారంతో ఎక్కడికక్కడ దుకాణం సర్దుతారు. ఈ లోపు ఎవరన్నా అధికారులు వస్తే వారిని ఎదిరించేందుకు ప్రైవేటు సైన్యంగా కొంతమంది ఉంటారు. వారిని పెంచి పోషిస్తుంటారు.



పంట పొలాలపై దుమ్ము లేపుతూ ఇసుక రవాణా

ఫిర్యాదులు అందినపుడు...

పత్రికల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు సంబంధించి కథనాలు వచ్చినపుడు, లేదా ఎవరినుంచైనా రాతపూర్వకంగా ఫిర్యాదులు అందినపుడు మాత్రమే అధికారులు కంటితుడుపు చర్యలతో మమ అనిపిస్తున్నారు. దీంతో ఆ అక్రమార్కుని సహజవనరుల దోపిడీకి అడ్డు, అదుపూ లేకుండా పోతుంది. గతంలో జనసేనపార్టీ పరంగా అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై ఆందోళనకు చేపట్టిన చర్యలను పోలీసులు నీరుకార్చారు. అప్పట్లో ఒకటి రెండురోజులు అక్రమ ఇసుక తవ్వకాలను నిలువరించారు. పట్టుబడ్డ టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తరువాత షరా మామూలే. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు వినియోగించే పొక్లయినర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు పట్టుబడ్డప్పుడు ప్రభుత్వ శాఖల పరంగా చేపడతున్న చర్యలు కంటి తుడుపుగా ఉంటున్నాయి. అదేవిధంగా ఆయా వాహనాలపై విధించే అపరాధ రుసుము కూడా తక్కువగా ఉంటుంది.

రోడ్లు పాడయ్యాయి..




ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా పుణ్యమా అని మా రోడ్లు పాడయ్యాయి. పొలానికి వెళ్లే దారంతా గోతులు పడింది. కడవకుదురు రైల్వేగేటు నుంచి 216 జాతీయ రహదారికి వెళ్లే దారి అడుక్కో గుంతగా తయారైంది. భారీ టిప్పర్లు తిరగటంతో రోడ్డంతా దుమ్ము రేగుతోంది. ఆ దుమ్ము చేలల్లో మేతను చుట్టుముడుతుంది. గేదెలు ఆ మేతను ఇష్టంగా తినలేకపోతున్నాయి. ఎవరికి చెప్పినా ప్రయోజనం లేదు. మా ఖర్మని సరిపెట్టుకోవాల్సి వస్తుంది. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

- పి.బ్రహ్మయ్య, కడవకుడుదురు, చినగంజాం మండలం

రైల్వేస్టేషన్లు.. జాతికి అంకితం

- కొన్ని పనులకు శంకుస్థాపన
- వీడియో లింకు ద్వారా ప్రారంభించిన ప్రధాని మోదీ
- గుంటూరులో హాజరైన బీజేపీ నేత సత్యకుమార్ డీఆర్ఎం ఎం. రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పేదలకు విమానాశ్రయాల స్థాయి సదుపాయాలు కల్పించడమే అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ ముఖ్య ఉద్దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన వీడియో లింకు ద్వారా ఏబీఎస్ఎస్ కింద అభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్లను జాతికి అంకితం చేశారు. అలానే మరికొన్ని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శంకుస్థాపన చేశారు. కొత్తగా నిర్మించిన ఆర్‌యూబీలను ప్రారంభించారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రధానమైన గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, బీజేపీ రాష్ట్ర నాయకుడు సత్యకుమార్, గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ, ఇతర అధికారులు, జెడ్ఆర్ యూసీసీ, డీఆర్‌యూసీసీ సభ్యులు హాజరయ్యారు. ఏబీఎస్ఎస్ కింద రూ.17.13 కోట్ల వ్యయంతో బాపట్ల, రూ. 15.80 కోట్లతో గుంటూరు, రూ.40.67 కోట్ల తో మంగళగిరి, రూ.11.30 కోట్లతో నరసరావుపేట, రూ.11.30 కోట్లతో సత్తెనపల్లి రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పను లన్నీ పూర్తి అయితే ఉత్తమ శ్రేణితో కూడిన అనుభూతి ప్రయాణీకులకు కలుగుతుందని ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ అన్నారు. అదేవిధంగా ఎన్ఎస్‌జీ-5 కేటిగిరీకి చెందిన పలు స్టేషన్ల అభివృద్ధి పనులను, అలానే ఆర్‌యూబీలకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలను గుంటూరు డివిజన్‌లో సోమవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక పాఠశాలల విద్యార్థులను భాగస్వామ్యం చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వికసిత్ రైల్వేస్టేషన్ల కాన్సెప్ట్‌తో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధు లను కూడా పాల్గొనేలా చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఆర్ఎంలు ఆర్.శ్రీనివాస్, కె.సైమన్, సీని యర్ డీఈఎన్ కోఆర్డినేషన్ జేవీ అనూష పాల్గొన్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ నేత సత్యకుమార్

పోలింగ్ ప్రక్రియపై అవగాహన ఉండాలి

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 26: రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో సోమవారం ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, వీఎస్‌టీ, వీవీటీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ముందుగానే అవగాహన చేసుకుని సమర్థవంతంగా పోలింగ్‌విధులు నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల విధుల మాస్టర్ ట్రైనర్స్, కలెక్టరేట్ తహసీల్దార్ సీతారామయ్య, జిల్లా ఆడిట్ అధికారి హరికృష్ణ, సీఐ మురళీకృష్ణ, బాపట్ల తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌లచే శిక్షణ ఇప్పించారు. పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, రేపల్లె ఆర్డీవో షారోను, మున్సిపల్ కమిషనర్‌లు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌లు, మండలప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ తదితరులు

నేను చేసిన సేవలను గుర్తించి ఓటెయ్యండి

బాపట్ల టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్లరూరల్, ఫిబ్రవరి 26: నేను చేసిన సేవా కార్యక్రమాలు చూసి తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి తనను గెలపించాలని బాపట్ల టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. సోమవారం పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్‌నగర్‌లో మీమాట - నా బాట, టీడీపీ - జనసేన జనబాట కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీర, చేతిసంచి, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికి ఒక్కొక్కరికి ఏడాదికి 15వేల రూపాయలు అందజేయటం జరుగుతుందన్నారు. ఆడబిడ్డ నిధి నుంచి 18ఏళ్ళు నిండిన ప్రతి స్త్రీకి నెలకి 1500 రూపాయలు అందజేయటం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సుప్రయాణం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల టీడీపీ మాజీ అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డి, టీడీపీ,జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు చీర, కరపత్రాలను అందజేస్తున్న వేగేశన

మౌర్యుల అనంతరం రాజ వంశాలు

శుంగవంశం

క్రీ.పూ.185లో చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని చంపి అతని సేనాని పుష్యమిత్రుడు 'శుంగ' వంశాన్ని స్థాపించాడు. మగధను రాజధానిగా చేసుకుని పాలించాడు. ఇతని కాలంలోనే అయోధ్య శాసనాన్ని ధనదేవుడు చెక్కించాడు.

పుష్యమిత్రుని సమకాలీనులు: పంజాబ్, కాబూల్ ప్రాంతాలను పాలిస్తున్న ఇండో గ్రీకు రాజు మినాండర్, కళింగ రాజు ఖారవేలుడు, శాతవాహన రాజు మొదటి శాతకర్ణి ఇతని సమకాలీనులు. అయితే అశ్వమేథ యాగం సందర్భంగా పుష్యమిత్రుని మినాండర్ ఓడించినట్లు తెలుస్తోంది.

శుంగ వంశ చరిత్రకు ఆధారాలు: పతంజలి- మహాభాష్యం, కాళిదాసు- మాళవికాగ్నిమిత్రం, పాణిని - అష్టాధ్యాయి, బాణుడు- హర్ష చరిత్ర, బౌద్ధ గ్రంథం- దివ్యావదన మొదలైనవి. ఉజ్జయిని రాకుమార్తె మాళవికను పుష్యమిత్రశుంగుని కుమారుడైన అగ్నిమిత్రుడు రాక్షస వివాహం చేసుకున్న ఇతివృత్తమే కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం'.

శుంగుల మత విధానం: శుంగుల కాలంలో వైదిక (బ్రాహ్మణ) మతం పునరుద్ధరణ జరిగింది.(దేవభూతి క్రీ.శ.72లో కణ్వ వంశీయుడైన వాసుదేవ కణ్వ చేతిలో మరణించాడు. దీంతో కణ్వవంశ స్థాపన జరిగి, శుంగ వంశం అంతరించింది).

- పుష్యమిత్ర శుంగుని కాలంలో సాంచి, బార్హుత్ స్థూపాలకు వాస్తుపరమైన అలంకరణ చేశారు. దీనిని బట్టి పరమత సహనం ఉన్నట్లు అర్థమవుతుంది. పుష్యమిత్రుడు అనేక మంది బౌద్ధులను సంహరించినట్లు పలు బౌద్ధ గ్రంథాల్లో రాసి ఉంది. కాని బిహార్, అయోధ్య, మాళ్వా ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు శుంగుల కాలంలోనే వర్ధిల్లినట్లు 'మహావంశం' అనే బౌద్ధ గ్రంథం పేర్కొంటోంది.
- చివరి శుంగ రాజులలో గొప్ప వాడైన భగబద్రరాజు ఆస్థానంలో గ్రీకు రాయబారి హీలియోడోరస్ (గ్రీకు రాజైన ఆంటియోకిడాస్ ఆస్థానం నుంచి వచ్చాడు) చేరాడు. ఈయన భిల్సా దగ్గర ఉన్న బేస్‌నగర్‌లోని విష్ణుదేవాలయంలో గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడే శాసనం కూడా చెక్కించాడు. భాగవతమతం, వాసుదేవ కృష్ణుని గురించి వివరించాడు. రాజకీయంగా చూస్తే... పుష్యమిత్రుని తర్వాత వసుమిత్రుడు, దేవభూతి, భగబద్రుడు మొదలైన వారు పరిపాలించారు. వీరందరి కాలంలో అన్ని మతాలు అభివృద్ధి చెందాయి. వసుమిత్రుడు కోసల రాజు మూలదేముడు చేతిలో హత్యకు గురయ్యాడు.
- శుంగ రాజ్యంలో పాంచాల, కోశాంబి రాజ్యాలు లేవు. అవి అప్పటికే మగధ నుంచి విడిపోయాయి. అంటే శుంగులు మగధను మాత్రమే పాలించారు.

శుంగుల కాలం నాటి ముఖ్యాంశాలు

- వైదిక మతాన్ని, ఆచారాలను, హైందవ పద్ధతులను పునరుద్ధరించారు. సంస్కృత భాషకు ఆదరణ పెరిగింది. పాళి, ప్రాకృత భాషల ప్రాధాన్యం తగ్గింది.
- వాయువ్య సరిహద్దుల వద్ద గ్రీకుల దాడుల నుంచి భారత దేశాన్ని కొన్ని సంవత్సరాల వరకు మాత్రమే కాపాడగలిగారు. ఈ కాలంలో సాంచీ స్థూపానికి తోరణాన్ని అద్భుతంగా చెక్కించారు. తర్వాత శాతవాహన రాజు శాతకర్ణి దీనికి తుది మెరుగులు పెట్టించాడు.
- క్రీ.పూ. రెండో శతాబ్దంలో పాణిని రచించిన వ్యాకరణానికి పతంజలి వ్యాఖ్యానం రాశాడు. దీని పేరు 'మహాభాష్యం'.
- శుంగులు అశ్వమేధయాగాలు చేశారు. వీరి ప్రధాన దైవం విష్ణువు. వీరి కాలంలో భాగవతం ప్రాముఖ్యం పెరిగింది. అయోధ్య శాసనంలో పుష్యమిత్రుడు రెండు అశ్వమేధయాగాలు చేసినట్లు రాసి ఉంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

మౌర్యులు - శుంగుల శిల్పకళలో భేదాలు

శుంగుల శిల్పకళపై విదేశీ ప్రభావం లేదు. మౌర్యుల శైలికి భిన్నమైన శైలి వీరిది. వీరి కాలంలో బౌద్ధ స్థూపాల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. చైత్యాలు, విహారాలు నిర్మించలేదు. వీరిది మౌర్యుల శిల్పంలా గుండ్రటి రూపం కాదు. అర్ధాకార రీతిలో ఉన్నాయి. మౌర్యుల శిల్పకళ కథకు సంబంధం లేని శిల్పాలు. కాని శుంగులవి జాతక కథలను తెలిపే శిల్పాలు. మౌర్యుల శిల్పాలు ఎక్కువగా జంతువులకు సంబంధించినవి. ఉదాహరణకు...

- ఒకీరా వద్ద సింహస్తంభం - ఎలాంటి అలంకరణ లేదు
- రామ్ పూర్వాస్తంభం - దీనిపై ఏనుగు శిఖరం ఉంది
- లౌరియానందన్‌గర్ - దీని శిఖరంపై సింహం ఉంది
- రుమ్మిందై స్తంభం(నేపాల్) - గుర్రం ఉంది
- సారనాథ్ - దీని శిఖరంపై నాలుగు సింహాలు ఉన్నాయి.

శుంగుల శిల్పాలలో ఎక్కువగా మానవ ఆకారాలు ఉన్నాయి. ఉదాహరణకు బార్హుత్ స్థూపంపై అజాత శత్రు తన తండ్రి బింబిసారుని చంపినందుకు ప్రాయశ్చిత్తం చెప్పవలసిందిగా బుద్ధున్ని అర్థిస్తున్న శిల్పం అద్భుతంగా చెక్కారు.

- మౌర్యుల శిల్పకళను చక్రవర్తులు, బౌద్ధ సంఘాలు, ధనికులైన ప్రజలు పోషించారు. మౌర్యుల కళలలోని పరిణితి శుంగుల శిల్పాలలో కనిపించదు. మౌర్యుల కళపై పర్షియన్ల ప్రభావం ఎక్కువ. శుంగుల కళ స్వదేశీయమైనది. పశ్చిమాసియ శిల్ప కళ ప్రభావం లేక పోలేదు.
- మౌర్యుల శిల్పాలు విడి విడిగా ఉండగా, శుంగుల శిల్పాలు పెద్ద పెద్ద కళా ఖండాల మీద చెక్కారు. శుంగుల చిత్రాలను 'చరణ చిత్రాలు' అంటారు. బౌద్ధానికి చెందినవి. వస్త్రంపై బుద్ధుడి జీవిత విశేషాలు చిత్రీకరించారు. మౌర్యుల కళ లౌకికమైనది.

క్షాత్రప రాజులు

వీరు శకుల వద్ద అధికారులుగా పని చేశారు. తరవాత కొంత కాలం కుషాణులకు కూడా సామంతులుగా ఉన్నారు. క్షాత్రపులందరిలో పశ్చిమ క్షాత్రపులు గొప్పవారు. వీరిలో గొప్పవాడు నహపాణుడు.

నహపాణుడు: శాతవాహనుల నుంచి మహారాష్ట్రను జయించాడు. బరోచ్(గుజరాత్), మహారాష్ట్ర, అజ్మీర్(రాజస్థాన్), మాళ్వా(మధ్యప్రదేశ్) మొదలైన ప్రాంతాలను ఇతను పాలించాడు. నహపాణుడు స్వతంత్రంగా పాలించిన మొదటి క్షాత్రపరాజు. హిందూ సంప్రదాయాలను పాటించాడు. ఇతని భార్య బౌద్ధులకు గుహాలయాలను నిర్మించింది. ఉజ్జయిని క్షాత్రపులలో తొలిరాజు యశోవర్మన్. వీరి వంశం పేరు 'కర్దమక'. తరవాత రాజు చష్టణుడు. ఉజ్జయిని క్షాత్రపులలో చివరి రాజు రుద్రదాముడు. చష్టనుని కాలం నుంచి వీరు కుషాణులకు సామంతులయ్యారు.

జునాగఢ్ శాసనం: దీనిని రుద్రదమనుడు రాయించాడు. ఇతని గురించిన వివరాలే ఈ శాసనంలో ఎక్కువగా ఉన్నాయి. క్రీ.శ.150లో రుద్రదమనుని పాలన ప్రారంభమైంది. గౌతమీపుత్ర శాతకర్ణి ఇతనికి సమకాలీనుడు. రుద్రదమనుడు మాళ్వా, సౌరాష్ట్ర(గుజరాత్), కచ్, కొంకణతీరం, తూర్పు పంజాబ్, వింధ్యా ఆరావళి పర్వతాల పశ్చిమ ప్రాంతాలను జయించాడు.

- చంద్రగుప్త మౌర్యుని కాలంలో గుజరాత్‌లో నిర్మించిన 'సుదర్శన చెరువు'కు పన్నులు విధించి, మరమ్మతులు చేయించాడు. రుద్రదామునికి సంగీత, తర్క, వ్యాకరణ శాస్త్రాల్లో ప్రావీణ్యం ఉండేది.
- చివరికి శకులు, పహ్లవులు, స్వదేశీ హిందూ సంస్కృతిలో కలిసిపోయారు. హిందూ దేవతలను ఆరాధించారు.

బార్హుత్ స్థూపం ప్రాధాన్యం



ఈ స్థూపాన్ని అశోకుడు నిర్మించాడు. కాని దీని చుట్టూ గల వేదిక లేక ప్రాకార తోరణాలు క్రీ.పూ.150 నాటి శుంగుల కాలంలో నిర్మించారు. బార్హుత్ స్థూపంలో అప్సరసల శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ స్థూపం మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో ఉంది. దీనిపై ఉన్న అంశాలను అలెగ్జాండర్ కన్నింగ్ హోం గాంధార నుంచి వచ్చినట్లుగా గుర్తించాడు. క్రీ.శ.1873లో అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్ బార్హుత్ స్థూపాన్ని సందర్శించాడు. మరుసటి సంవత్సరం స్థలాన్ని తవ్వాడు. జోసఫ్ డేవిడ్ బెగ్లర్ సహాయకుడిగా పనిచేశాడు. ఈ బౌద్ధశైలి భారతీయ కళ ప్రారంభ దశను సూచించడం, బౌద్ధ చిహ్నంతో ఇండో-గ్రీకు సైనికుడిగా భావించే విదేశీయుడి విగ్రహం ఉండటం... దీనిలోని ప్రత్యేక శైలి.

సాంచి స్థూపం: మొదట అశోకుడు దీనిని నిర్మించాడు. తర్వాత శుంగులు దీనిపై రాతి కప్పు నిర్మాణం చేశారు. దీనిని ఇటుకలతో నిర్మించారు. రాతి అండం, పెద్ద ఛత్రం, వేదిక నిర్మించారు. ఈ స్థూపం తోరణాలపై గల శిల్పాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి.



డాక్టర్ ఐ.నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FpZEgVDలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ, ఫరీదాబాద్)- ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in

ఇన్సూరెన్స్ అకాడమీలో పీజీడీఎం

పుణెలోని నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ(ఎన్ఐఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ, ఏఐయూ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానమైనదిగా గుర్తించింది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, అనలిటిక్స్, టెక్నాలజీ సంబంధిత కోర్ సబ్జెక్టులతో పాటు జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, రీ-ఇన్సూరెన్స్ అండ్ పెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/సీమ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. క్యాట్ 2023లో కనీసం 75 పర్సంటైల్, ఎక్స్ఏటీ 2024లో కనీసం 85 పర్సంటైల్, సీమ్యాట్ 2024లో కనీసం 95 పర్సంటైల్ ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంపిక: అభ్యర్థులను అకడమిక్ ప్రతిభ, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** pgdm.niapune.org.in

జాబ్ కార్నర్

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

బ్రాంచి వివరాలు: జనరల్ సర్వీస్: 50, పైలెట్: 20, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 18, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 8, లాజిస్టిక్స్: 30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 10, ఎడ్యుకేషన్: 18, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 30, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 50, నావల్ కన్‌స్ట్రక్టర్: 20.

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

సెయిల్‌లో టెక్నీషియన్‌లు

ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... వివిధ విభాగాల్లో ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(ట్రెయినీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 324 (మెటలర్జీ: 57, ఎలక్ట్రికల్: 64, మెకానికల్: 100, సివిల్: 22, కెమికల్: 18).

అర్హతలు: పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు సంబంధిత సబ్జెక్టులో ఇంజనీరింగ్ డిప్లొమా చేసి ఉండాలి. ఓసీటీటీ-డ్రాఫ్ట్స్‌మన్ పోస్టుకు ఏడాది పాటు డ్రాఫ్ట్స్‌మన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: https://sail.co.in/

నవ్య | చిత్రజ్యోతి



హాలీవుడ్‌లో రిలీజ్ అనుకున్నాం

శ్రీవిష్ణు

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకుడు. వి. సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మాతలు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇంగ్లీష్‌లో తీసి హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం. ఇలాంటి పాయింట్‌తో ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. మా ముగ్గురి పాత్రలూ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతాయి. రెండు గంటల పాటు నవ్వుతూనే ఉంటారు. గుప్తనిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు. ట్రైలర్, సినిమా అద్భుతంగా ఉంటాయని ప్రియదర్శి చెప్పారు. దాదాపు ఏణ్ణార్థం స్పేస్ షూట్‌లో షూటింగ్ చేశాం అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

ఇకమీదట ఇలాంటివి వద్దు

మోహన్‌బాబు



'కొంతమంది స్వార్థపరులు వారి రాజకీయ లబ్ధి కోసం నా పేరును ఉపయోగించుకొంటున్నట్లు తెలిసింది. మీరు ఏ పార్టీ వారైనా మీ ప్రయోజనాల కోసం నా పేరును వాడుకోవద్దు' అని మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఇక మీదట ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన సోమవారం సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఎవరిష్టం వారిది, చేతనైతే నలుగురికి సాయపడాల్సింది పోయి ఏ సంబంధం లేనివారిని రాజకీయాల్లోకి లాగడం బాధాకరమని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్నారు.

అందగత్తెగా అలరించాలనుంది



'హీరోయిన్ అవ్వాలనే నా చిన్ననాటి కలను టాలీవుడ్ నిజం చేసింది. అందుకు తెలుగు పరిశ్రమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇప్పుడు గ్లామర్ పాత్రల్లో ప్రేక్షకులను అలరించాలనేదే నా లక్ష్యం' అని హీరోయిన్ రాశి సింగ్ చెప్పారు. శివ కందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశి సింగ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎయిర్‌హోస్టెస్‌గా ఉద్యోగం చేశాను. చిన్నప్పటి నుంచే హీరోయిన్ అవ్వాలనుకున్నాను. 'ప్రేమ్‌కుమార్, పాపం పసివాడు' సినిమాల్లో నటించాను. కథానాయికగా మంచి పాత్రలు దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది. మున్ముందు వైవిధ్యమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కోరిక.
- అనుకోకుండా 'భూతద్ధం...' ఆడిషన్‌కు వెళ్లి హీరోయిన్‌గా ఎంపికయ్యాను. మా దర్శకుడు తను రాసుకున్న పాత్రకు నేను సరైన ఎంపిక అని భావించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు లక్ష్మి. తనో జర్నలిస్ట్. ఆధునిక భావాలున్న యువతిగా కనిపిస్తాను. కథ విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. సస్పెన్స్, థ్రిల్, రొమాన్స్ పాటలు... ఇలా అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి.

ఒక యోధుడి ప్రేమకథ



సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. దిశాపటానీ కీలకపాత్ర పోషించారు. దర్శక ద్వయం సాగర్ ఆంబ్రే, పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు. ధర్మ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే యూనిట్ ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'యోధ' ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా తెలుగు మీడియాతో ముచ్చటించారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ "యోధ' యువతలో దేశ భక్తిని, ధైర్యాన్ని పెంపొందించే ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ సినిమాలో భాగమవ్వడమే ఒక అసాధారణ ప్రయాణం. ప్రేక్షకులను ఈ చిత్రం తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. రాశీ ఖన్నా మాట్లాడుతూ "యోధ'లో పనిచేయడం ఒక ఉత్తేజకర అనుభవం. ధైర్యం, ప్రేమ కలబోతగా తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.



కాన్సెప్ట్ మెప్పించింది

విరాన్ ముత్తంశెట్టి కథానాయకుడిగా వేణు మురళీధర్ వి. దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అయినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి మా చిత్రమే ఉదాహరణ. రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోంది' అని చెప్పారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'కొత్త కాన్సెప్ట్‌తో తీయడం వల్ల సినిమా ప్రేక్షకులకు చేరువైంది. తొలి చిత్రమే అయినా దర్శకుడు మంచి అవుట్‌పుట్ ఇచ్చారు' అని ప్రశంసించారు. 'ముఖ్య గమనిక'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు హీరోయిన్ ఆర్యన్ కృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

కృష్ణ నిర్యాణం నుంచి కల్కి అవతారం వరకు



దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ కథానాయకుడు కావడం, కమల్ హాసన్ ప్రతినాయకుడిగా కనిపించనుండడం సినిమాపై క్రేజ్‌ను పెంచాయి. ఇక ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు పొందిన నాగ్‌అశ్విన్ విజన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఊహకు అందని స్థాయిలో ఆయన 'కల్కి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ప్రచార చిత్రాలతోనే తెలుస్తోంది. ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 'కల్కి' కథకు సంబంధించిన విశేషాలను వివరించారు. 'మహాభారత గాథ, 'స్టార్ వార్స్' సినిమాలు నాకు చాలా ఇష్టం. ఈ రెండు విభిన్న ప్రపంచాలను కలుపుతూ ఓ సినిమా చేయాలనే ఆలోచనలోంచి 'కల్కి' చిత్రం పుట్టింది. ఈ సినిమా కథ మహాభారత కాలం నాటి శ్రీకృష్ణ నిర్యాణంతో మొదలై కల్కి అవతారం వరకూ సాగుతుంది. అందుకే టైటిల్ అలా పెట్టాం. మొత్తం ఆరు వేల సంవత్సరాల కథ ఇది. గతం నుంచి భవిష్యత్తులోకి చేసే ప్రయాణం. మున్ముందు ప్రపంచం ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేశాం. దానికోసం అద్భుతమైన ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. 'బ్లేడ్ రన్నర్' లాంటి హాలీవుడ్ చిత్రానికి అనుకరణగా అనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం సవాల్‌గా అనిపించింది. ఏఐ టెక్నాలజీ ఉపయోగించకుండా మా సృజనకు పదునుపెట్టి చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని చెప్పారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిశాపటానీ, దీపికా పదుకొనే కథానాయికలు. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.



'యువత, కందిరీగ' తదితర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అక్ష పర్దాసానీ ఓ ఇంటివారయ్యారు. తన స్నేహితుడు, సినిమాటోగ్రాఫర్ కౌశల్‌ను సోమవారం పెళ్లాడారు. ఆ ఫొటోలను అక్ష ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

అలరించే అమ్మపాట



విశ్వ కార్తిక్, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ సంయుక్తంగా నిర్మించారు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. సోమవారం దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా 'జో జో లాలీ అమ్మ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. పాట చాలా బావుందని యూనిట్‌ను ఆయన అభినందించారు.

గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూత



"చిట్టి ఆయీ హై", "ఔర్ ఆహిస్తా కీజియే బాతే" అంటూ మధురమైన గానంతో సంగీత ప్రియులను మైమరపించిన ఆ గొంతు మూగబోయింది. ప్రముఖ గజల్, నేపథ్య గాయకుడు పంకజ్ ఉధాస్ (72) ఇక లేరు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫరీదా, కూతుళ్లు రేవా, నయాబ్ ఉన్నారు. పంకజ్ ఉధాస్ మరణ వార్తను నయాబ్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. చాలా బరువైన హృదయంతో.. పద్మశ్రీ పంకజ్ ఉధాస్ కన్నుమూశారని తెలియజేయడానికి మేము చింతిస్తున్నామని ఆమె ప్రకటించారు. మంగళవారం పంకజ్ ఉధాస్ అంత్యక్రియలు జరగనున్నాయి. "నామ్", "సాజన్", "మొహ్రా" వంటి అనేక హిందీ చిత్రాలకు పంకజ్ ఉధాస్ గాత్రదానం చేశారు. పంకజ్ గుజరాత్‌లో సంగీత నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ తీగల వాయిద్యం దిల్రూబాను వాయించే వారు. ఆయన ఇద్దరు సోదరులు మన్హర్ ఉధాస్, నిర్మల్ ఉధాస్ కూడా గాయకులే. 1986లో విడుదలైన నామ్ చిత్రంలోని "చిట్టి ఆయీ హై" పాటతో ఆయన ప్రొఫెషనల్ సింగర్‌గా గుర్తింపు పొందారు. ఆ తర్వాతి నుంచి ఆయన చాలా ఆల్బమ్‌లను రికార్డు చేశారు. 2006 సంవత్సరంలో భారత ప్రభుత్వం పంకజ్ ఉధాస్‌ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gI8Gctj లో చదవండి.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

ఇసుకను బొక్కేశారు.. అమరావతిని తొక్కేశారు

- మూడు ముక్కలాటతో రాష్ట్రానికి తీరని నష్టం..
- 1532వ రోజుకు చేరుకున్న రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్ళూరు , ఫిబ్రవరి 26: రాష్ట్రంలో ఇసుకను వైసీపీ నేతలు తెగ బొక్కేశారని, అందుకే ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబునల్) రూ.1908 కోట్లు జరిమానా విధించిందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. మూడు రాజధానులు వద్దు, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని, బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1532వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ మూడు రాజధానుల మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రానికి తీరని నష్టాన్ని మిగిల్చారన్నారు. అభివృద్ధిని విస్మరించి వనరులన్నింటినీ దోచుకుతిన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి విషయంపై ఉన్నత న్యాయ స్థానం తీర్పును లెక్కచేయని నియంత జగన్‌రెడ్డి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలన్నారు. నియంతృత్వం పోవాలంటే ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేసి అమరావతి వెలుగు కార్యక్రమం రాజధాని గ్రామాలలో కొనసాగించారు.

టీడీపీలోకి వైసీపీ నేత కళ్ళం హరినాథ్‌రెడ్డి

- కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన అధినేత చంద్రబాబు



హరినాథ్‌రెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు, పక్కన వేగేశన

బాపట్ల, ఫిబ్రవరి 26 : వైసీపీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది కళ్ళం హరినాథ్‌రెడ్డి సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద హరినాథ్‌రెడ్డికి టీడీపీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మ సేవాకార్యక్రమాలపై ఆసక్తితో హరినాథ్‌రెడ్డి టీడీపీలో చేరారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన రెండుసార్లు బాపట్ల ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు. రెడ్డి సామాజిక వర్గానికి ఎమ్మెల్యే కోన రఘుపతి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని పలుమార్లు ఆరోపణలు గుప్పించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బాపట్ల టిక్కెట్టును నరేంద్రవర్మకు ప్రకటించటంతో వైసీపీ స్థానిక నాయకుల విధానాలు నచ్చక ఆపార్టీని వీడి టీడీపీలో చేరినట్లు హరనాథ్‌రెడ్డి తెలిపారు. నరేంద్రవర్మ విజయానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

అర్ధరాత్రి ఘర్షణలపై

మూడు కేసులు

- ఇరు వర్గాలలోని 30 మందిపై నమోదు
- ఘర్షణకు కారణమైన వడ్డిముక్కల నాగభూషణంపై కేసు
- వడ్డిముక్కల గ్రామంలో పోలీస్ పికెటింగ్



కాల్వపై నడకదారికి అడ్డంగా నిర్మించిన కర్రల తడిక, ఫ్లెక్సీలు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి26: పరస్పర దాడులు తీవ్ర ఉధృత్తలకు దారితీసిన సంఘటనలపై పొన్నూరు అర్బన్, రూరల్ పోలీసులు మూడు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి డీఎస్పీ రమేష్ తెలిపారు. పొన్నూరు పట్టణంలో అధికార వైసీపీలోని రెండు వర్గాలు ఆదివారం అర్ధరాత్రి పొన్నూరు పోలీస్‌స్టేషన్ సాక్షిగా పరస్పర దాడులకు తెగబడ్డారు. ఇరువర్గీయుల పరస్పర దాడుల నేపథ్యంలో ఒక్కొక్క వర్గంలోని 15 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే ఈ దాడులకు మూల కారకుడైన వడ్డిముక్కల గ్రామానికి చెందిన చింతకింద నాగభూషణంపై కేసు నమోదు చేసి రూల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలకు నేపథ్యం...

మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో గ్రామ ప్రధాన రహదారి వెంట చింతకింద నాగభూషణ రావు గృహం ఉంది. ఈ గృహం ముందు నుంచి మూడు అడుగుల వెడల్పుతో తమకు నడక దారి ఉందని, ఆ సమీపంలోనే నివాసం ఉంటున్న ముస్లీంలు అంటున్నారు. అయితే నాగభూషణరావు ఆ స్థలం కూడా తనదేనంటూ, ఆవైపు నడకదారి లేకుండా మురుగు కాల్వపై అడ్డంగా కర్రలతో దడి ఏర్పాటుచేసి, ఆ దడికి వైసీపీ ఫ్లెక్సీలను కట్టి మురుగు కాల్వను పూడ్చివేసాడు. ఈసందర్భంగా ఏర్పడిన వివాదంతో నాగభూషణరావు తమను మతపరంగానూ, వ్యక్తిగతంగానూ దూషించాడని స్థానిక ముస్లిం మహిళలు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వడ్డిముక్కల ముస్లీంలు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అనుచరుడు షేక్ మహ్మద్ అలియాజ్ మామూ, వైసీపీలో అసమతి వర్గనేతగా ముద్రపడిన మైనార్టీ నేత షేక్ నాజర్‌లు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో అసలు విషయం పక్కదారిపట్టి, కొసరు విషయం (వైసీపీలో గ్రూపు తగాదాలు) వచ్చి చేరింది. దీంతో వివాదం ముదిరింది. నాజర్, మామూల వర్గీయులు పోలీస్‌స్టేషన్ సాక్షిగా బాహాబాహీ ఘర్షణకు దిగారు. ఇరువర్గాలకు చెందిన వందలాది మంది అక్కడకు చేరుకొని కర్రలు, రాళ్ల గాజు సీసాలు విసురుకోవటంతో పలువురికి గాయాలయ్యాయి. ఆ సమయంలో పలువురు పోలీసులకు సైతం దాడులకు గురికావల్సి వచ్చింది. పరిస్థితి చేయిదాటిపోవటంతో తెనాలి డీఎస్పీ రంగంలోకి దిగి అధనపు పోలీస్‌సిబ్బందిని రప్పించి పరిస్థితిని అదుపుచేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే పోలీస్ స్టేషన్ సాక్షిగా, పోలీసుల సమక్షంలో అధికార వైసీపీలోని రెండు వర్గాల వారు కర్రలు, సీసాలతో ఘర్షణకు దిగడం శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల వైఫల్యాన్ని తేటతెల్లం చేసింది.

గ్రామంలో పోలీస్ పికెటింగ్..

స్వల్ప వివాదం నేపథ్యంలో తీవ్ర ఉధృత్తలకు దారితీసిన వడ్డిముక్కల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి రూరల్ ఎస్ఐ బీ. భార్గవ్ నేతృత్వంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసారు. గ్రామంలోకి బయట వ్యక్తుల సంచారంపై నిఘా పెట్టారు.

జగన్.. అసమర్థ సీఎం

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు



సభలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు, వేదికపై కన్నా, వైవీ

సత్తెనపల్లి ఫిబ్రవరి 26: పరిపాలన చేతకాని అసమర్థ సీఎం జగన్ అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శించారు. సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం 'నవ్యాంధ్ర రాష్ట్రం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఆయన నవ్యాంధ్ర రాష్ట్రం పుస్తకాన్ని ఆనందబాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఆయనపై ఉన్న కేసుల నుంచి తప్పించుకోవడానికి, ఆస్తులను కూడబెట్టుకోవడానికి తన అధికారాన్ని, ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతినే రాజధానిగా ఒప్పుకున్న జగన్, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. పోలవరం అభివృద్ధిని చంద్రబాబునాయుడు 72శాతం పూర్తి చేస్తే జగన్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించాడన్నారు. మద్య నిషేధం హామీని అమలు చేయడంలో విఫలమయ్యాడన్నారు. సైకో జగన్‌ను రాష్ట్రం నుండి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కన్నా లక్ష్మీనారాయణను సత్తెనపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీఎంజగన్ అన్నివర్గాల ప్రజలను దారుణంగా మోసం చేశాడన్నారు. నవరత్నాలు, సంక్షేమం ముసుగులో రాష్ట్రాన్ని దోచుకున్నాడన్నారు. సైకో జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి, నాగేతు శౌరయ్య, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, అంకాళ్ళ ప్రభుదాసు, తురకా మేరిగ్రేస్, యెలినేడి లక్ష్మీ తులసీ, నాగరాజు, సాంబయ్య, రామచంద్రరావు, ఆశీ ర్వాదం, దత్తాత్రేయులు, అబ్దుల నబీ తదితరులు పాల్గొన్నారు.

యువతను రోడ్డుపాలు చేసిన జగన్‌రెడ్డి

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు
- యువతతో 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్'



యువ ఓటర్లతో ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన నేత రాజా రమేష్

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 26 : ఒక్క ఛాన్స్ అన్న మాట నమ్మిన పాపానికి యువతను రోడ్డున పడేసిన ఘనుడు సీఎం జగన్ అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ అమలు చేయలేని హామీలు ఇచ్చి యువత ఓట్లు కొల్లగొట్టి మోసం చేశారని ఆయన మండి పడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిరుద్యోగ భృతితో పాటు రకరకాల హామీలు ఇచ్చి జగన్ మోసం చేశాడని, అందుకే ఈ సారి రాష్ట్రంలో యువత తొలిసారిగా వేసే ఓటు దేశ, రాష్ట్రగతిని మార్చేదిగా ఉండాలన్నారు. మంగళవారం పట్టణంలోని పత్తిపాటి గార్డెన్‌లో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్' కార్యక్రమానికి మాజీ మంత్రి ప్రత్తిపాటితో పాటు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు తేజశ్వని పొడపాటి, జనసేన నేత తోట రాజారమేష్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా తేజశ్వని మాట్లాడుతూ 2024 ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు చాలా కీలకం అన్నారు. ఆ దృష్ట్యా అన్ని రంగాలకు చెందిన ప్రొఫెషనల్ యువతతో పాటు ప్రతి ఒక్కరు రాష్ట్రాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రాజా రమేష్ మాట్లాడుతూ భవిష్యత్‌లో తమకు ఎవరు ఉన్నత భవిష్యత్ కల్పిస్తారు? ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు? అనే విషయాలను యువత ఆలోచించాలన్నారు. గత ఎన్నికల్లో జగన్ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మించి యువతను మోసంచేశారన్నారు. జగన్‌పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రాలేదని, గంజాయి మాత్రం దేశం మొత్తం ఎగుమతి చేస్తున్నారని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తొలిసారి ఓటు వచ్చిన యువత పాల్గొన్నారు.

భారత జాతీయ ప్రమాణాలపై

గ్రామ సర్పంచ్‌లకు వర్క్‌షాప్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 27: భారతదేశ జాతీయ ప్రమాణాల సంస్థ (బ్యూరో ఇండియన్ స్టాండర్డ్స్)ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు దఫాలుగా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి మార్చి 1 వరకు, మార్చి 4 నుంచి 7 వరకు రోజుకు వర్క్‌షాప్ జరగనుంది. వివిధ ఉత్పత్తులపై భారతీయ ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ఈవర్క్‌షాప్ ఏర్పాటుచేయనున్నారు. గుంటూరు జిల్లా వారికి గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో, పల్నాడు జిల్లాకు చెందినవారికి నరసరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో, బాపట్లజిల్లాకు చెందిన వారికి అక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఈ వర్క్ షాప్ జరగనుంది.



ఏపీ భవన్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న పాపారావు

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- ఏపీ భవన్ వద్ద బాపట్లవాసి నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రత్యేక హోదా ఇవ్వాలని బాపట్లు వాసి పాపారావు డిమాండ్ చేశారు. సోమవారం, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీ భవన్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆయన నిరసన తెలిపారు. రైతు భరోసా ,వెల్ నెస్ సెంటర్ల కాంట్రాక్ట్ నిర్మాణం పనులు చేపట్టినప్పటికీ జగన్ సర్కారు తనకు నిధులు విడుదల చేయలేదన్నారు. దాదాపు రూ.25 లక్షల మేర డబ్బులు రావాల్సి ఉందన్నారు. గత ఎన్నికలలో జగన్‌కు ఓటు వేశానని.. ఇప్పుడు మాత్రం ఓటు వేయబోనని పాపారావు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

టీడీపీ, జనసేన సీట్ల ప్రకటనతో

వైసీపీకి వెన్నులో వణుకు

- ఓటమి భయంతో మంత్రుల అవాకులు చెవాకులు
- జనసేనాని ఆదేశాలను శిరసావహించేందుకు సిద్ధం
- ధ్వజమెత్తిన జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి 26: టీడీపీ, జనసేన కూటమి సీట్ల ప్రకటన చూసి వైసీపీ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే మంత్రులు అవాకులు, చెవాకులు పేలుతున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో గ్రావెల్, మట్టి మాఫియా చేసుకోవడానికే అంబటి రాంబాబుకు మంత్రి పదవి ఇచ్చినట్లు ఉందని గాదె దుయ్యబట్టారు. నియోజకవర్గంలో అంబటి ఓట్లు అడగానికి వెడితే.. ఆడవాళ్లు చెప్పులతో కొడతారని ఆయన ధ్వజమెత్తారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం వదిలి వేరే నియోజకవర్గానికి పారిపోయిన చెల్లని నాణెం లాంటి చెల్లుబోయిని వేణుగోపాల్ కూడా జనసేన, టీడీపీ కూటమిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మహా జనానికి మరదలు పిల్ల వంటి మంత్రి రోజాకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ దొరకడం కూడా కష్టమేనని, ముందు తన ఉనికిని ఆమె కాపాడుకోవాలని గాదె హితవుపలికారు. జనసేనాని పవన్ కల్యాణ్ ఇచ్చే ఎటువంటి ఆదేశాలనైనా క్రమశిక్షణతో పాటించేందుకు జనసైనికులు, వీరమహిళలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు శిఖా బాలు, బిట్రగుంట మల్లిక, చట్టాల త్రినాద్, చింత శివ, గోపిశెట్టి సాయి, యర్రంశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

అరాచకత్వం రాజ్యమేలుతోంది

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్
- వైసీపీ దాడిలో గాయపడిన బాధితుడికి పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న సత్యకుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26 : ఆంధ్రప్రదేశ్‌లో ఆరాచక పరిస్థితి రాజ్యమేలుతోందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. ఇటీవల నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెంలో వైసీపీ దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణను సోమవారం స్థానిక బీజేపీ నేతలతో కలసి సత్యకుమార్ పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగిశెట్టి రామకృష్ణ బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం ప్రచారంలో ఉండగా వైసీపీ రౌడీమూక వెంకటప్పారెడ్డి, జయబారత్‌రెడ్డిలు బీజేపీ నేతలపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. కేసు రిజిస్టర్ చేయకపోతే సీఎం ఇంటిని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు, బీజేపీ నేతలు డాక్టర్ ఎన్. వెంకటరావు, కృపారావు, ఆదినారాయణ, హనుమంతురావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

ఎమ్మెల్యే కిలారికి ధూళిపాళ్ళ లీగల్ నోటీస్..

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 26: ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం లీగల్ నోటీస్‌ను పంపించారు. 2019 అసెంబ్లీ ఎన్నికలో పరాజయం పాలైన సందర్భంలో నరేంద్ర కుమార్ కాపు సామాజిక వర్గంపై అనుచిత వాఖ్యలు చేసారని తీవ్ర వెల్లలూరు గ్రామంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆరోపించారు. తనపై నిరాధార ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే కిలారికి నరేంద్ర కుమార్ తన న్యాయవాది ద్వారా పరువు నష్టం నోటీస్‌ను పంపించారు. కాపు కులస్తుల మనోభావాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ఎమ్మెల్యే కిలారి ప్రయత్నిస్తున్నారన్ని లీగల్ నోటీస్‌లో నరేంద్రకుమార్ పేర్కొన్నారు. వారంరోజులో ఈ విషయమై బహిరంగ క్షమాపణ ప్రకటించి రూ. కోటి నష్టపరిహారంగా చెల్లించని పక్షంలో కోర్టులో కేసు దాఖలుచేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని నరేంద్రకుమార్ నోటీసులో హెచ్చరించారు.



తిరునాళ్ళకు సంబంధించి పలు సూచనలు చేస్తున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

కోటప్పకొండ తిరునాళ్లకు సిద్ధం

- త్రికోటేశ్వరుని దర్శించుకున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 26 : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ళకు పోలీసు అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకరరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆయన కోటప్పకొండ పరిసరాలను పరిశీలించి తిరునాళ్ళ ఏర్పాట్లకు సంబంధించి తగు సూచనలు చేశారు.వాహనాల రాకపోకలు, పార్కింగ్, భక్తుల కోసం క్యూ ఏర్పాటు, ప్రభలు నిలిపే ప్రదేశాలు తదితర వాటికి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. గత సంవత్సరం తిరునాళ్ళ సమయంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య తలెత్తితే దానికి కారణం తెలుసుకొని ఈ సంవత్సరం ఆ విధ మైన సమస్య ఉత్పన్న మవ్వకుండా చూడాలన్నారు. రోడ్లు భవనాలశాఖ సమన్వయంతో రోడ్లు వెడల్పు చేయించటం, రోడ్డు మార్గాల్లో అవాంతరాలు ఉంటే తొలగించటం, చిన్న చిన్ని బ్రిడ్జీలు, కల్వర్టులను బాగు చేయించటం తదితర పనులు చేయించాలని సూచించారు. ఆలయ అధికారులతో మాట్లాడి కొండపైన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడిచుట్టూ ఫెన్సింగ్ వేయించాలన్నారు. ప్రభలు నిలిపే ప్రదేశాలు పరిశీలించి అక్కడ ఎటువంటి అవాంతరాలు ఎదురవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ రామచంద్రరాజు, నరసరావుపేట డీఎస్పీ వర్మ, ఎస్‌బీ సీఐలు ప్రభాకర్, బాల నాగిరెడ్డి, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రోశయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన అనంతరం బ్రోచర్ ఆవిష్కరణ చేస్తున్న వర్సిటీ ప్రతినిధులు

సార్వత్రిక మానవత్వాన్ని పెంపొందించాలి

- ఆస్ట్రేలియాలోని ఫ్లిన్‌డర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిలియన్ డూలె
- ఏఎన్‌యూలో ప్రారంభమైన మూడు రోజుల గ్లోబల్ సదస్సు

పెదకాకాని, ఫిబ్రవరి 26 ప్రతి ఒక్కరిలో మానవతా విలువలు పెంపొందించుకునేలా సార్వత్రిక మానవత్వాన్ని చూపాలని ఆస్ట్రేలియాలోని ఫ్లిన్‌డర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్. జిలియన్ డూలే అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో 'మార్జినాలిటీ మల్టీకల్చరల్ లెటర్ నేటివ్ ఆస్ట్రేలియా అండ్ ఇండియా' అనే అంశంపై మూడు రోజుల గ్లోబల్ సదస్సు సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి సదస్సు డైరెక్టర్ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య పీ.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న ప్రొఫెసర్ డూలే మాట్లాడుతూ సమాజంలో విద్వేషాలు, మారణకాండలు, జాతిపరంగా అనేక హింసలు జరుగుతున్నాయని, వాటిని తొలగించి మానవత్వాన్ని చూపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అణగదొక్కబడేవారు వెనుకబాటుతనంలోనే ఉంటున్నారని, మానవులంతా సమానమే అన్న రీతిలో వారికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరు గుర్తెరగాలన్నారు. అమెరికాలోని ఈస్ట్ కరోలైన యూనివర్సిటీ ప్రొఫెసర్ సియోడియల్ ఫ్రాంక్‌హెచ్.డీన మాట్లాడుతూ బహుళ సాంస్కృతిక సమ్మిళిత సమాజాన్ని పెంపొందించడానికి సంగీతం, నృత్యం కీలకపాత్ర పోషిస్తాయని వాటిల్లోకి నేడు క్రీడలు చేరాయన్నారు. ఉన్నతులు, బలహీన వర్గాల వారిని చేరదీయాలే గాని ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. వీసీ పీ. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రతి దేశంలో ఏదో ఒక ప్రాంతంలో అణగారిన వారు అణగదొక్కబడుతూనే ఉన్నారన్నారు. దీనికి కారణం అతి కొద్ది మంది చేతుల్లో అధికారం, సంపద ఉండటమేనన్నారు. అంతర్గతంగా ఉన్న బలమైన వర్గం నుంచి ఎదురవుతున్న వివక్ష అధికంగా ఉంటుందని అన్నారు. మరొక వక్తగా పాల్గొన్న కలకత్తాలోని యూనివర్సిటీ ఆఫ్ బుర్ద్వాన్ నుంచివచ్చిన ప్రొఫెసర్ ప్రొఫెసర్ అంగ్సుమాన్ కర్ మాట్లాడుతూ ఆస్ట్రేలియా అధ్యయనాల పరిధిని విస్తృతం చేసేలా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ చేస్తున్న పరిశోధనలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ.కరుణ, ఇంగ్లీష్ విభాగాధిపతి ప్రొఫెసర్ జీ.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

కేసులో రాజీ పడనందున వ్యక్తి హత్య

- నిందితులను శిక్షించాలని దళిత సంఘాల ఆందోళన



సాంబశివరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు

కొల్లిపర, ఫిబ్రవరి 26 : పాత కేసు విషయంలో రాజీ పడనందున ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన నాలాది సాంబశివరావు (35)కు అదే గ్రామానికి చెందిన సమ్మెట అంజనేయులు కుటుంబ సభ్యుల మధ్య పాత కేసులు ఉండటంతో పాటు కోర్టులో విచారణ జరుగుతుంది. ఈ కేసు విషయంలో సాంబశివరావు రాజీకి రావటంలేదని మనస్సులో పెట్టుకుని సోమవారం తెల్లవారు జామున సమ్మెట అంజనేయులు అతని భార్య భూలక్ష్మీ, మరొక వ్యక్తి చాగంటి శేఖర్‌రెడ్డి కలిసి హత్య చేసినట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. సాంబశివరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని విచారణచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాంబశివరావును హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దావులూరు అడ్డరోడ్డు సెంటర్‌లో దళిత సంఘాల నేతలు బడ్డికొట్టును తగలబెట్టి ఆందోళన చేశారు. డీఎస్పీ రమేష్ నిందితులను తొందరలోనే అరెస్టు చేస్తామని హామీ ఇవ్వటంతో వారు ఆందోళనను విరమించారు.

1,42,382 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,59,820 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా, 1,42,382 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,03,060 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లుపేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	13800	19000
273	12500	16000
341	11000	20500
4884	12000	15000
సూపర్ 10	–	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10000	20000
దేవనూరు డీలక్స్	12000	19500
తెల్లకాయలు	5000	13000



బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


నరేంద్రవర్మకు బొకే అందజేస్తున్న పిట్టలవానిపాలెం మండల జనసేన నాయకులు

వేగేశనకు శుభాకాంక్షలు..

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 26: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా టీడీపీ బాపట్ల ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మను ప్రకటించటంపై సోమవారం టీడీపీ నేతలు నరేంద్రవర్మను కలసి శుభాకాంక్షలు తెలిపారు. బాపట్లపార్లమెంట్ మైనార్టీసెల్ అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం, కార్యదర్శి సయ్యద్ జునేద్ తదితరులు పూలమాలలు, దుశ్శాలువాలతో వేగేశన నరేంద్రవర్మను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చందోలు టీడీపీ నేతలు సయ్యద్‌గౌస్ బాషా, అబ్దుల్‌ఖాదర్, సయ్యద్ అహ్మద్, షేక్.అన్వర్, హుస్సేన్, సాగర్, ఫెడ్రిక్, రమేష్‌లు పాల్గొన్నారు.

జనసేనపార్టీ పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్ (దాదా) ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు వేగేశన నరేంద్రవర్మను మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు షేక్.ధరియా, షేక్.సలీం, షేక్.హబీబ్, సయ్యద్ అన్సారి, షేక్.జంగీర్, ఎన్.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయవాదుల రిలే దీక్షలో మాట్లాడుతున్న బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు

న్యాయవాదుల దీక్షలను విస్మరించడం తగదు

● రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు

రేపల్లె, ఫిబ్రవరి 26: రైతు వ్యతిరేక చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు 50 రోజులుగా దీక్షలు చేస్తున్న ప్రభుత్వం విస్మరించడం తగదని రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. సోమవారం రిలే నిరాహార దీక్ష 50వ రోజుకు చేరగా, టీడీపీ స్టేట్ బీసీసెల్ సెక్రటరీ రాయన ప్రసాద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రావూరి వరప్రసాద్, న్యాయవాది మునిపల్లి సుబ్బయ్యలు సంఘీభావం తెలిపారు. గోపాలరావు మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం వలన జరిగే నష్టం గురించి ప్రజలు తెలుసుకొని, న్యాయవాదుల దీక్షలకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆళ్ళ సూరిబాబు, పుప్పాల ఐజ్, కొలుసు రామారావు, కే.జగదీష్, దామర్ల శ్రీనివాసరావు, జీ.గిరిధర్, న్యాయవాదుల గుమ్మస్తాలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత టీడీపీలో చేరిక

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 26: మండలంలోని చందోలు గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, దక్షిణమధ్య రైల్వేబోర్డు మాజీ సభ్యుడు షేక్.నియాజ్ సోమవారం టీడీపీలో చేరారు. బాపట్ల నియోజకవర్గ జనసేన-టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వ ర్యంలో, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు.


చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరుతున్న కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు షేక్ నియాజ్

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 26: రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు సంవత్సరాల తరబడి పాలకవర్గ ఎన్నికలు నిర్వహించకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆరోపించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, కార్మికుల పించన్ల మంజూరులో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలు రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ సీహెచ్ పద్మావతికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో అర్హులైన చేనేత కార్మికులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరుచేసినప్పటికీ పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కె.రామకోటేశ్వరరావు, కె.మోహనరావు, బట్టు వెంకటసుబ్బారావు, జగన్మోహనరావు, కె.కోటేశ్వరరావు, కె.పార్థసారథి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావుపాల్గొన్నారు.


తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

నేరచరిత్ర ప్రకటించాలి : డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, ఫిబ్రవరి 26: అన్ని రాజకీయ పక్షాలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలుగా ఉన్నాయి.ఈ నేపథ్యంలో అనేక రాజకీయపక్షాలు నేరచరిత్రగల అభ్యర్థులను కూడా ఎంపిక చేయటానికి సిద్ధపడుతున్నాయని ఎన్నికల నిఘావేదిక రాష్ట్రకన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం ఆయన మాట్లాడుతూ నేరచరిత్ర కలిగిన అభ్యర్థుల వివరాలు వెల్లడి చేయాలన్నారు. సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అటువంటి వారిని ఎందుకు ఎంపికచేయాల్సివచ్చిందో కారణాలను రాజకీయపక్షాలు బహిరంగంగా ప్రకటించాలన్నారు. రాజకీయపక్షాలు అటువంటి అభ్యర్థుల గురించి సోషల్‌మీడియాలో, స్థానిక పత్రికలలో ప్రజలకు తెలిసేలా వివరాలు ప్రకటించాలన్నారు.

29 నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

బాపట్ల, ఫిబ్రవరి 26: ఈనెల 29వ తేదీ నుంచి మార్చి 5వరకు జిల్లాలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీపీవో రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉదయం 100మంది, మధ్యాహ్నం 100మందికి చొప్పున ప్రతిరోజు 200మందికి శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. జిల్లాలోని 25మండలాలలో 523 గ్రామపంచాయతీలకు సంబంధించి 29వ తేదీ రేపల్లె, కొల్లూరు, మధ్యాహ్నం అద్దంకి, కొరిశపాడు, మార్టూరు, మార్చి1న ఉదయం పర్చూరు, చినగంజాం, చీరాల, ఇంకొల్లు, సాయంత్రం అమర్తలూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, చందోలు, 4న ఉదయం కారంచేడు, యద్దనపూడి, బాపట్ల, మధ్యాహ్నం సంతనూతలపాడు, నిజాంపట్నం, పిట్టలవానిపాలెం, 5న ఉదయం వేమూరు, జె.పంగులూరు, కర్లపాలెం, మధ్యాహ్నం బల్లికురవ, వేటపాలెం, నగరం మండలాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఆయన కోరారు.

గోవాడ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

అమృతలూరు, ఫిబ్రవరి 26: జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ శ్రీబాల కోటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల ఏర్పాట్లును అధికారులు సోమవారం పరిశీలించారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లును పరిశీలించిన తగు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలపై సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు. పండుగ ప్రత్యేక అధికారి గద్దె అమర్నాథ్ ఉత్సవాల ఏర్పాట్లపై సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు. క్యూల ఏర్పాట్లు, భక్తులకు అందించాల్సిన సేవలపై ఈవో ఈమని అశోక్‌రెడ్డికి పలు సూచలు ఇచ్చారు. ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కేంద్రం ఏర్పాటు

అమృతలూరు, ఫిబ్రవరి 26: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కేంద్రం ఏర్పాటును అమృతలూరులో సోమవారం ప్రారంభించారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో యూనియన్‌బ్యాంక్ సౌజన్యంతో అసోసియేషన్ ఫర్ వెల్ఫేర్ యాక్టివ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని కౌన్సిలర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ కేంద్రాన్ని యూనియన్ బ్యాంకు అధికారి యశ్వస్వి, మోహన్‌కృష్ణ, వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఇన్సూరెన్స్ డిజిటల్ బ్యాంకింగ్, సైబర్‌నేరాలు, వినియోగదారుల సమస్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రం అమృతలూరు, చుండూరు, చెరుకుపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఏపీఎం రాంబాబు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 26: ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ సత్వర పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు అర్జీలు ఇచ్చారు. గ్రామదర్శినిలో వచ్చిన అర్జీలు ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉండటంతో అధికారులను ప్రశ్నించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తే ప్రజలు సమస్యలతో మరోసారి ఎందుకొస్తారని అధికారులను ప్రశ్నించారు? ప్రజలు క్షేమంగా ఉండాలంటే అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయటం, కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవటం వంటివి చేయరాదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

నాణ్యతలేని రొయ్యపిల్లల సీడ్‌ను ఇచ్చి మోసం చేశారు..

బాపట్లరూరల్: రేపల్లెకు చెందిన కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తనకు బాపట్ల మండలం పాండురంగాపురంలోని మైక్రాల్ ఆర్‌అండ్‌డీ ఫామ్స్ అనే నర్సరీలో రూ.2లక్షల విలువైన నాసిరకం రొయ్యపిల్లలను ఇచ్చి మోసం చేశారని సదరు కంపెనీపై అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు స్పందనలో అర్జీని అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు జయప్రదం చేయండి

బాపట్ల: విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ల ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్‌బ్యాంక్ మేనేజర్ కె.శివకృష్ణమోహన్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 1 వర కు వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, నినాదం, పోస్టర్ అనే మూడు విభాగాలలో పోటీలను పాఠశాల, ఇం టర్ విద్యార్థులకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 10 నుంచి 25 సంవత్సరాల లోపు వయసుగల విద్యార్థులు పోటీలలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థి పేరు, పాఠశాల/కళాశాల పేరు, వయసు, ఫోన్‌నెంబరు తప్పనిసరిగా దరఖాస్తులో పేర్కొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో విజేతలకు బహుమతుల ప్రదానంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సి.హెచ్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపు అమానుషం

● రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

భట్టిప్రోలు, ఫిబ్రవరి 26: టీడీపీ సానుభూతిపరులపై అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం అమానుషమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక గ్రామ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలులో విధులు నిర్వర్తిస్తున్న ఇందిర, మార్కండేయులు అనే ఇరువురు బీసీ వర్గానికి చెందిన వలంటీర్లను టీడీపీ సానుభూతిపరులు అనే నెపంతో తొలగించారన్నారు. రాజకీయ కక్షలతో ఉద్యోగుల్ని ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. వైసీపీ కార్యకర్తలకే వైసీపీ కండువాలు కప్పి టీడీపీ నుండి వైసీపీలోకి భారీగా వలసలు వస్తున్నాయని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి వైసీపీ దుర్మార్గపాలన తరిమికొట్టేందుకు ప్రజలందరూ ఐక్యంగా మాజీ మంత్రి ఆనందబాబుకు అండగా నిలవాలని కోరారు. వేమూరు నియోజకవర్గం నుంచి ఆనందబాబు పేరును మొదటి జాబితాలో ప్రకటించడంపై పార్టీశ్రేణులు ధన్యవాదాలు తెలిపాయి. కార్యక్రమంలో నాయకు లు కనపర్తి సుందరరావు, యడ్ల జయశీలరావు, ఆదిన బసవపున్నయ్య, జంగం శ్యాంసన్, సుధీర్, లోకానంద్, కలాం, ఇబ్రహీం బేగ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

పోలీసు కార్యాలయంలో స్పందనకు 56 దరఖాస్తులు

బాపట్ల, ఫిబ్రవరి 26: సమస్యలపై స్పందించి పరిష్కరించాలని కోరుతూ జిల్లా నలుమూలల నుంచి 56మంది సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్ అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని ఫిర్యాదుదారులకు భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులన్నిటిపై విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.సింగయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ మహేష్

అకౌంట్‌లో డబ్బులు మాయం.. ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

బాపట్ల, ఫిబ్రవరి 26 : బాపట్ల పట్టణంలోని బేతనీకాలనీకి చెందిన ఆశావర్కర్ బోదాటి ఉషకు ఓ అజ్ఞాత వ్యక్తి 'కలెక్టరేట్ నుంచి ఫోన్ చేస్తున్నా.. నాపేరు నవీన్. మీ ప్రాంతంలో కరోనాతో చనిపోయిన నరాల అమరావతికి పరిహారం అందించేందుకు ఆమెకు సంబంధించిన వ్యక్తి ఫోన్ నెంబరు కావాలి' అని అడిగారు. దీంతో ఆమె నరాల చందన హైదరాబాద్‌లో ఉంటుందని ఆమె ఫోన్‌నెంబరు ఇచ్చింది. సదరు వ్యక్తి చందన్‌కు ఫోన్ చేసి మాట్లాడిన తర్వాత ఆమె బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.45వేలు కట్ అయ్యాయి. దీంతో లబోదిబోమంటూ ఆమె ఆశావర్కర్‌కు ఫోన్ చేసి గొడవపడింది. నీవు నంబర్ ఇవ్వటం వలనే నా డబ్బులు పోయాయంటూ గొడవ పడటంతో ఆమె సచివాలయ అడ్మిన్, మహిళ పోలీసుతో కలిసి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేసింది. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు.

స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు

రేపల్లె, ఫిబ్రవరి 26: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమమని ఇన్‌చార్జ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేకా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరం మండలం అల్లపర్రు గ్రామానికి సంబంధించిన భూమి సర్వే సర్టిఫికెట్‌ను ఇప్పించాలని, రేపల్లె మండలం బేతపూడి గ్రామానికి సంబంధించిన 2022లో వచ్చిన తుఫాన్ పంట నష్టపరిహారాన్ని ఇప్పించాలని రెండు అర్జీలు అందాయి. పురపాలక సంఘంలో ఇంటిస్థలం సర్వే సర్టిఫికెట్ ఇప్పించాలని కోరగా రేపల్లె మండలం ఉప్పూడి గ్రామంలో తమ భూమి సమస్యను పరిష్కరించాలంటూ ఒక అర్జీ దాఖలైందన్నారు. పట్టణ ఆదర్శవేదిక సభ్యులు సర్దార్ కాటన్ దొర విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటుచెయ్యాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారని కోరారు. ఈ సమస్యలను ఆయా అధికారులకు తెలిపి పరిష్కారానికి కృషి చెయ్యనున్నట్లు తెలిపారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 26: బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును ఖరారుచేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు సోమవారం వేగేశన నరేంద్రవర్మ కృతజ్ఞతలు తెలిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్ళి పుష్పగుచ్ఛం అందజేశారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో ఐక్యంగా విజయం సాధిస్తానని నరేంద్రవర్మ పేర్కొన్నారు.


చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

రైల్వేస్టేషన అభివృద్ధికి నిధుల కేటాయింపు అభినందనీయం

ఎంపీ నందిగం సురేష్


సభలో మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

బాపట్ల, ఫిబ్రవరి 26: బాపట్ల రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిధులు కేటాయించటం అభినందనీయమని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. బాపట్ల రైల్వేస్టేషన్‌ను అమృత్‌భారత్ స్కీమ్ కింద రూ.27.38 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాపట్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలో వీక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ సురేష్ మాట్లాడుతూ వేమూరు, రేపల్లె, చీరాల రైల్వేస్టేషన్‌ల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించాలని కోరారు. చీరాల రైల్వేస్టేషన్‌లో వ్యాపారుల సౌలభ్యం కొరకు కొన్ని రైళ్ళు ఆగేలా చూడాలన్నారు. బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఆధునాతన వసతులు ఏర్పాటుచేయటం సంతోషదాయకమన్నారు. రైల్వేస్టేషన్ ప్రధానద్వారంతోపాటు ప్రయాణప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్‌రూమ్‌లు, సమాచార సూచికలు వృద్ధి చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైల్వే డీఈఎన్ మయాంక్ ఉపాధ్యాయ, స్టేషన్ సూపరింటెండెంట్ కజోడ్‌మాల్ మీనా, డీఎంవో చైతన్య, ఛీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, ఛీఫ్ టిక్కెట్టు ఇన్‌స్పెక్టర్ టి.గీత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, నాయకులు బి.బాబునాగేంద్ర, జీవీఎల్ మోహన్‌గౌడ్, రామకృష్ణ, తిరుపతయ్య, బండ్రెడ్డి శ్రీధర్, బ్రహ్మాండం బాలనారాయణ, కొమ్మినేని లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఉపాధి అవకాశాలు

● 'బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ'లో టీడీపీ నేతలు


బాపూజీపాలెంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

రేపల్లె, ఫిబ్రవరి 26: యువతకు ఉపాధి అవకాశాలు కావాలన్నా, రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలన్నా మరోసారి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ఐతేనే సాధ్యమని నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. సోమవారం నిజాంపట్నం మండలంలోని బాపూజీపాలెంలో 'బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన ఆరు పథకాలతో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, నిజాంపట్నం మండల పార్టీ అధ్యక్షులు ఓగిబోయిన వెంకట్ యాదవ్‌లు మాట్లాడుతూ ప్రజలు టీడీపీ, జనసేనకు మద్దతుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బొమ్మిడిరామకృష్ణ, కూచిపూడి మోహన్‌రావు, మేకా రాజేష్ కన్నా, శొంఠి శ్రీనివాసరావు, బొర్రా సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు మాజీ మంత్రి పరామర్శ

కొల్లూరు, ఫిబ్రవరి 26: మండలంలోని గాజుల్లంక గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సనకా పాపారావు అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సోమవారం వైద్యశాలకు వెళ్లి ఆయనను పరామర్శించారు. మెరుగైనచికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

తమ వ్యాఖ్యలను వక్రీకరించారు: వైసీపీ నాయకులు

కర్లపాలెం, ఫిబ్రవరి 26: రాష్ట్రంలోని ముస్లిం సామాజికవర్గానికి జనాభా దామాషా ప్రకారం చంద్రబాబునాయుడుకు సీట్లు కేటాయించలేదని తాను మాట్లాడితే టీడీపీ నాయకులు షేక్ బాజి, అహ్మద్‌బాషాలు వక్రీకరించారని వైసీపీ కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్ అన్నారు. కర్లపాలెంలోని వైసీపీ కార్యాలయంలో అమీర్‌బేగ్ వైసీపీ నాయకులతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. ముస్లిం సామాజికవర్గానికి రాజ్యాధికారం కోసం నేను మాట్లాడితే టీడీపీ బాజి తనను వ్యక్తిగతంగా విమర్శించటం హేయమైన చర్యని అమీర్‌బేగ్ అన్నారు. తాను రాజకీయంగా మాట్లాడితే ఎంపీటీసీ బాజి వ్యక్తిగత దూషణలు చేయటం తగదన్నారు. అనవసర వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, ఎంపీటీసీ ఆసిఫ్‌ఆలీ, వార్డుమెంబర్లు ఇమ్రాన్, జానీ, మైనార్టీసెల్ అధ్యక్షుడు షంషేర్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల దుస్థితిపై ఫ్లెక్సీల ఏర్పాటు

● ఆక్రోశంతో ఫ్లెక్సీలు తొలగించారని ఆరోపణలు

అమృతలూరు, ఫిబ్రవరి 26: వైసీపీ ప్రభుత్వం ఏర్పడి 4 సంవత్సరాల 10 నెలలు కావస్తున్నా అధ్వానంగా ఉన్న రోడ్లను పునర్నిర్మించకపోవడంతో వాటి దుస్థితిని వివరిస్తూ టీడీపీ కార్యకర్తలు 20 చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. అమృతలూరులో, మండల పరిధిలోని తెనాలి - చెరుకుపల్లి ప్రధాన రహదారి, అమృతలూరు- యలవర్రు, ఇంటూరు - యలవర్రు, రహదారుల్లో ఆయా గ్రామాల మధ్య అధ్వానపు రోడ్ల దుస్థితిని ఎత్తిచూపుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లో రోడ్డులు పునఃనిర్మించే దమ్ము టీడీపీ ప్రభుత్వంకు ఉందంటూ ఫ్లెక్సీలను టీడీపీ కార్యకర్తలు ప్రదర్శించారు. కాగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వాటిని తొలగించారు. అధికార పక్షం వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.


రోడ్డు అధ్వాన స్థితిని వివరిస్తూ టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ


పురుగుమందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరం

ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల టౌన్, ఫిబ్రవరి 26: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ కళాశాలలో రెండురోజులు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరక, మానసిక వికాసానికి క్రీడ లు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. వివిధ ఫార్మసీ కళాశాలల నుండి పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు అన్ని వసతులను కల్పించామన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, క్రీడాకారులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని నైపుణ్యాన్ని సాధిస్తే ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు డి.రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, ట్రెజరర్ తాళ్ళూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోపాలకృష్ణ, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులపై వివక్ష చూపుతున్న కేంద్ర ప్రభుత్వం

బాపట్ల టౌన్, ఫిబ్రవరి 26: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులపట్ల వివక్షను విడనాడాలని సీపీఐ జిల్లానాయకుడు జెబీ శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంజాబ్, హర్యానా రాష్ట్రాలలోని రైతులు ఢిల్లీ సరిహద్దులలో కేంద్రప్రభుత్వం అనుసరించే విధానాలను నిరసిస్తూ చేస్తున్న పోరాటానికి సీపీఐ నాయకులు మద్దతు తెలుపుతున్నారన్నారు. రైతుల న్యాయమైన డిమాండ్లను కేంద్రప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రైతులకు గుదిబండగా మారిన వ్యవసాయ చట్టాలను తక్షణమే వెనక్కితీసుకొని రైతులకు ఆదాయాన్ని రెట్టింపు చేసే విధానాలు రూపకల్పన చేయాలన్నారు. రైతులను నిర్లక్ష్యంచేస్తే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 26: భట్టిప్రోలుకు స్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుండి జారిపడి మృతి చెందాడు. తెనాలి జీఆర్‌పీ ఎస్‌ఐ ఎల్.సరస్వతి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం రేపల్లె - సికింద్రాబాద్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు నుండి వ్యక్తి జారిపడి తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి 55 నుండి 60 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునన్నారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రవికిరణ్ పర్యవేక్షణ చేస్తున్నారు.

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

రేపల్లె, ఫిబ్రవరి 26: రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మాదిగలను విభజించి పాలించాలని చూస్తున్న రాజకీయ పార్టీల కుట్రలను ప్రతిఘటిస్తూ వచ్చే ఆదివారం బాపట్లలో జరిగే మాలల సింహగర్జన సభను జయప్రదం చెయ్యాలని మహాసభ జిల్లా ప్రచార సభ కార్యదర్శి చల్లపల్లి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోమవారం సభ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో సుప్రింకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను కొట్టివేసిన నాటి నుండి ప్రతి ఎన్నికల సమయంలోను రాజకీయ పార్టీలు వర్గీకరణ అంశాన్ని లేవనెత్తి తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం కొత్త నాటకాలు ఆడుతున్నాయన్నారు. ఈ సభకు రేపల్లె నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో పీపుల్స్ రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, చింతపట్టుని సూరిబాబు, కర్రా బాబూరావు, ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

కర్లపాలెం, ఫిబ్రవరి 26: కర్లపాలెంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సమాజసేవకులు ఆలపాటి వెంకటరమణరావు భార్య రాజశ్రీదేవిలు సోమవారం 60మంది నిరుపేద మహిళలకు సోమవారం చీరలను పంపిణీ చేశారు. వారందరికి భోజనం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘనాయకులు తూనుగుంట్ల లలితబాబు, వెంకటసుబ్బారావు, కొమ్మూరి మురళీ, పానుగంటి హరినాథబాబు, బొలిశెట్టి రాంబాబు, తూనుగుంట్ల సురేష్‌కుమార్, జగన్, శివప్రసాద్, జీవిగుప్తా, రామ్మోహనరావు, రత్నకుమార్, అచ్యుతభద్రయ్య, మద్దుల రామకృష్ణ, కూనం చంద్రశేఖర్, నాళం అనిత, రాజేశ్వరి, అనూష తదితరులు పాల్గొన్నారు.

200మంది పేదలకు అన్నదానం

కర్లపాలెం, ఫిబ్రవరి 26: కర్లపాలెం వైఎస్సార్ కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో కొక్కిలిగడ్డ రామరాజు 28వ వారం 200మంది నిరుపేదలు, బాటసారులు, వృద్ధులకు శాకాహార బిరియాని సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాతపూడి మనోహర్, పిట్ల బళ్ళారెడ్డి, శ్రీకాంత్, ఏట్ర దుర్గారెడ్డి, శ్రావణ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ కుమారి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా

● చేనేత కార్మికులకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు..

భట్టిప్రోలు, ఫిబ్రవరి 26: మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బండారు కుమారి శ్రీనివాసరావులు వైసీపీకి రాజీనామా చేశారు. సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో జడ్పీటీసీ దంపతులు మాట్లాడుతూ వైసీపీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన తమకు పార్టీలో తగిన గుర్తింపు లభించలేదన్నారు. మూడు రాజధానుల నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని సీఎం జగన్‌రెడ్డి చెప్పడం బాధ కలిగించిందని, మంత్రి నాగార్జున గ్రామంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. చేనేతవర్గాలకు వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు ఏమీ లేదని, వైసీపీని నమ్మే పరిస్థితి లేదని పార్టీలో ఇమడలేక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన అనుచరులతో పార్టీకి రాజీనామా చేస్తున్నామని త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని వారు చెప్పారు.


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కుమారి శ్రీనివాసరావు

నూతన ఓటర్లకు అవగాహన

బాపట్ల పార్లమెంట్ టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని

బాపట్ల, ఫిబ్రవరి 26: నూతనంగా ఓటు హక్కు పొందిన ఓటర్లకు అవగాహన కల్పించి టీడీపీకి ఓటువేసేవిధంగా మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ బాపట్లపార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని తెలిపారు. బాపట్లలోని 30వ వార్డు 71వ పోలింగ్‌బూత్ పరిధిలో సోమవారం మహిళా నాయకులతో కలిసి ఇంటింటా తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు పొందే వయసు ఉన్నప్పటికీ ఓటరుగా నమోదుకాని వివరాలు తీసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించారు. ప్రతిఒక్కరు టీడీపీకి అండగా ఉండి బాపట్లలో నరేంద్రవర్మను, రాష్ట్రంలో చంద్రబాబును గెలిపించుకోవాలని ఆకాంక్షించారు. యువత భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో మహిళా నాయకులు కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, షేక్ నజ్మా తదితరులు పాల్గొన్నారు.


30వ వార్డులో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పల్లం సరోజని, తెలుగుమహిళలు

పురుగుమందుల షాపులపై విజిలెన్స్ దాడులు

నగరం, ఫిబ్రవరి 26: మండలంలోని పరిశావారిపాలెంలో అన్నపూర్ణ ఎంటర్‌ప్రైజెస్ పురుగుమందు లు దుకాణంలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్‌ఐ ఎం.రామచంద్రయ్య మాట్లాడుతూ తనిఖీల్లో అనుమతిపత్రాలు లేకుండా అమ్మకాలు చేస్తున్న ఫె డస్టల్ అనే పురుగుమందును 20లీటర్ల స్టాక్‌ను స్వా ధీనం చేసుకున్నామన్నారు. దీనివిలువ రూ.99,500 ఉందని, ఈ పురుగుమందుల అన్నింటిని సీజ్‌చేసి కేసు నమోదుచేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రమణకుమార్, వ్యవసాయాశాఖాధికారులు వి.రమేష్‌బాబు, కె.నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.



బూత్ లెవెల్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఈఆర్వో వెంకటేశ్వర్లు

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

పర్చూరు, ఫిబ్రవరి 26: బూత్‌స్థాయి అధికారులు ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక రాజ్యలక్ష్మి కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి బూత్ లెవెల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు ఫాం 6,7,8 క్లయింలపై విచారణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత కల్గిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించటమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. నూతన ఓటరుగా 18 నుంచి 20 సంవత్సరాల మధ్యలో వయస్సు కలిగిన వారికి ఓటు హక్కు కల్పించాలని చెప్పారు. ఆపైబడిన వయస్సువారి దరఖాస్తులను నిశితంగా పరిశీలన చేయాలన్నారు. నూతన దరఖాస్తులపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆధారాలన్నీ సేకరించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో వసతులు ఉన్నాయో, లేవో గుర్తించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు సీహెచ్ సుబ్బయ్య ప్రమీల, ఆరు మండలాల బూత్‌లెవెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 26: జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో మంగళవారం 9 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఎస్.విష్ణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 25కు పైగా కంపెనీలతో 2500 మందికి పైగా ఉపాధి కల్పించేందుకు ఈమెగా జాబ్ మేళా ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

వాణిజ్య విభాగం ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

పర్చూరు, ఫిబ్రవరి 26: మార్టూరు మండలం ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో మార్చి 2న జరిగే వాణిజ్య విభాగం ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులకు అండగా టీడీపీ నిలుస్తుందన్నారు. అనంతరం వాణిజ్య విభాగం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు మామిడిపాక హరిప్రసాద్, శ్రీరాం వెంకటసుబ్బారావు, కొల్లా శ్రీనివాసరావు(డాబా), పఠాన్ బాజీ, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేస్తున్న చినగంజాం రైల్వేబోర్డు మెంబర్లు

చినగంజాం, ఫిబ్రవరి 26: ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని చినగంజాం రైల్వే బోర్డు మెంబర్లు షేక్ జిలాని, కోలా సుబ్బారావు, కె.పద్మావతి, ఎం.అంకమ్మరాజ కోరారు. చినగంజాం రైల్వే స్టేషన్లో రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలని, 17643-17644 సర్కార్ ఎక్స్‌ప్రెస్, రైలు నెంబరు 17488-17487తిరుమల ఎక్స్‌ప్రెస్‌లకు గతంలో ఉన్న స్టాపులను పునరుద్ధరించాలని కోరారు. చినగంజాం రైల్వేస్టేషన్ చుట్టుపక్కల మండలాలకు సంబంధించి సుమారు లక్షా యాభై వేల మంది ప్రజలకు కేంద్ర స్థానమని చెప్పారు. ఈ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ లేకపోవడంతో 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న చీరాల, 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒంగోలు రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో ప్రజలు ఎంతో వ్యయప్రయాసలు పడి ప్రయాణం చేయవలసి వస్తుందని చెప్పారు. 12711-12712 నెంబరు గల పినాకిని ఎక్స్‌ప్రెస్, 12709-12710, 12733-12734 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని కోరుతూ రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు. ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన అండర్‌పాస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్ ద్వారా ప్రారంభించే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు చినగంజాం రైల్వే బోర్డు మెంబర్లు వినతిపత్రం అందజేశారు.

ఆదర్శ రైతుకు సేవా నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న పోతిని వెంకటరావు

పోతినవారిపాలెం(పర్చూరు), ఫిబ్రవరి 26: ఆధునిక పద్ధతిలో వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధిస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచిన కారంచేడు మండలం పోతినవారిపాలెం గ్రామ రైతు పోతిని వెంకటరావుకు సేవా నంది నేషనల్ అవార్డు దక్కింది. అఖిల భారత సహకార సంస్థ నేతృత్వంలో అవార్డు ఎంపిక కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయంలో అభ్యుదయ రైతుగా ఇన్నోవేషన్ ఫార్మింగ్ చేసిందుకుగాను అవార్డు ప్రకటించారు. ఈ అవార్డుకు తెలుగు రాష్ట్రాల నుంచి 14 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, పోతిని వెంకటరావు ప్రథమ స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అఖిలభారత సహకార సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా వెంకటరావును పలువురు అభినందించారు.

వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడిగా 'కన్నెగంటి'



కన్నెగంటి శ్రీనివాసరావు

మార్టూరు , ఫిబ్రవరి 26: తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం మార్టూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కన్నెగంటి శ్రీనివాసరావు, అర్వపల్లి కౌశిక్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆమోదించినట్లు ఆపార్టీ మార్టూరు మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యక్షులుగా మార్టూరుకు చెందిన చెరుకూరి అంజిబాబు, గుడిపాటి సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఆర్వ శ్రీనివాసరావు(వలపర్ల), తిరువీదుల మస్తాన్‌రావు(కోలలపూడి), అర్వపల్లి సురేంద్ర(మార్టూరు), కార్యదర్శిగా మారం సాయికుమార్(మార్టూరు), గట్టా మానదీరావు, అర్వపల్లి మల్లికార్జునరావు నియమితులైనట్టు తెలిపారు.

సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

మేదరమెట్ల , ఫిబ్రవరి 26: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే సిద్ధం సభ ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. సోమవారం పి.గుడిపాడు వద్ద సభ జరిగే ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. సభ నిర్వహించడానికి అనువైన సభాస్థలి, వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాల గురించి అధికారులతో చర్చించారు. గుంటూరు వైపు, ఒంగోలు వైపు, హైదరబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాద్‌రావు, సీఐలు మల్లికార్జునరావు, ఏ.శివరామకృష్ణారెడ్డి, కృష్ణయ్య, కె.నరసింహారావు, పి.సీతారామయ్య, సత్యనారాయణ, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో నూతనోత్సాహం

» అత్యధిక గ్రామాల నుంచి స్వచ్ఛందంగా

గొట్టిపాటిని కలుస్తున్న కార్యకర్తలు, ఓటర్లు



ఎమ్మెల్యే రవికుమార్‌కు సంఘీభావం తెలుపుతున్న అద్దంకి పట్టణంలోని 13వ వార్డు నేతలు(ఫైల్)

అద్దంకి, ఫిబ్రవరి 26: టీడీపీ క్యాడర్ ఫుల్ జోష్‌లో ఉంది. తొలి జాబితాలోనే అద్దంకి టీడీపీ అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్‌ను ప్రకటించటంతో పాటు అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్ర స్థాయిలో కీలక అంశాలను చర్చించే సమయంలో కూడా గొట్టిపాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికితోడు గత మూడు, నాలుగు నెలల ముందు నుంచే గొట్టిపాటి ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలలో మమేకమై ప్రత్యర్థులకు అందనంత ముందులో ఉన్నారు. నియోజకవర్గంలో అత్యధిక గ్రామాలు కవర్ అయ్యే విధంగా సైకిల్ యాత్రలు నిర్వహించారు. సైకిల్ యాత్రలో కవర్ కాని గ్రామాలలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం ఏర్పాటుచేసి పాల్గొన్నారు.

ఇక ఎన్నికలు సమీపించటంతో తొలి విడతలో అన్ని మండలాల నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాలవారీ సమీక్షలు ప్రారంభించారు. ఒక్కో గ్రామం నుంచి 50 నుంచి వంద మందికి తగ్గకుండా సమీక్షకు హాజరయ్యేలా చేస్తున్నారు. వీటిన్నింటికి మించి ఆయా గ్రామాలలో తటస్థులు, టీడీపీ వైపు వచ్చే శ్రేణులను కూడా పిలిపించి అందరి సమక్షంలోనే సమీక్ష నిర్వహిస్తున్నారు.

బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గత 20 సంవత్సరాల నుంచి పరిచయాలు ఉండటం, మిగిలిన అద్దంకి, పంగులూరు, కొరిశపాడు మండలాలలో కూడా గత మూడు ఎన్నికలలో సంబంధాలు ఉండటం గొట్టిపాటికి కలిసి వచ్చే అంశంగా మారింది. నియోజకవర్గంలో సుమారు 80శాతం ఓటర్లు ఏదో ఒక సందర్భంలో రవికుమార్‌కు ఓటు వేసి ఉండటం, అత్యధిక శాతం ఓటర్లకు నేరుగా వ్యక్తిగత పరిచయం ఉండటం కలిసి వచ్చేఅంశంగా మారింది.

ఈనేపథ్యంలోనే నేతలతో పనిలేకుండా ఎక్కువ మంది ఓటర్లు గొట్టిపాటిని కలిసి సంఘీభావం తెలుపుతున్నారు. పలువురు నేతలు సైతం అధికారపార్టీలో ఉన్నా మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా వెళ్లి కలిస్తున్నారు. కొంతమంది అధికారపార్టీ నేతలు రవికుమార్‌కు సంఘీభావం తెలిపిన తరువాత అధికారపార్టీ నేతల నుంచి వస్తున్న ఒత్తిడి తో కొద్దిమంది వెనుకడుగు వేస్తున్నప్పటికీ వాళ్ళతో వెళ్లిన అత్యధిక శాతం క్యాడర్ మాత్రం గొట్టిపాటితోనే నడుస్తున్నారు. గత ఎన్నికలలో ఫ్యాన్ గాలి బాగా వీచినప్పటికి 13 వేలకు పైగా మెజారిటీతో గొట్టిపాటి గెలుపొందగా, ప్రస్తుతం మారిన పరిస్థితుల నేపథ్యంలో భారీ మెజార్టీ సాధించే దిశ గా టీడీపీ క్యాడర్, నేతలు అడుగులు వేస్తున్నారు. దీంతో అద్దంకి నియోజకవర్గ టీడీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం వచ్చింది.

అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు మహిళలు సిద్ధం

అద్దంకి, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో అసమర్థ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గొట్టి పాటి రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదలచేశారు. మద్యపాన నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి మద్యం అమ్మకాలతో ప్రభుత్వాన్ని నడిపే దుస్థితికి వచ్చారన్నారు. మద్యపాన నిషేధం పేరుతో మహిళల్ని దారుణంగా వంచించటమే కాక తన ఖజానాన్ని నింపుకోవటానికి ఏకంగా రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అమ్మకానికి గేట్లు ఎత్తారన్నారు.

భవిష్యత్‌లో ఏ ప్రభుత్వం కూడా మద్యపాన నిషేదం అమలు చేయటానికి వీల్లేకుండా 15 ఏళ్ళపాటు మద్యంపై వచ్చే ఆదాయాన్ని జగన్ అప్పుల కోసం తాకట్టు పెట్టారన్నారు. జగన్‌రెడ్డి అమ్ముతున్న నాసిరకం మద్యం తాగి దాదాపు 35 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని ఆస్పత్రి పాలయ్యారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 4 లక్షల బెల్ట్‌షాపులు పెట్టించి ప్రజల రక్తమాంసాలతో మద్యం వ్యాపారం చేస్తున్నారని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. మూడు రాజధానులు చేస్తా నన్న జగన్‌రెడ్డి మూడు ప్రాంతాలలో మూడు ప్రధాన నగరాలను గంజాయి హబ్‌లుగా మార్చారని పేర్కొన్నారు.

'భవనాసి' రైతులకు సాగునీటి కష్టాలు

» చెరువులో పూర్తిస్థాయిలోలేని నీరు

» లోలెవల్ కాలువ నుంచి హైలెవల్‌కు పంపింగ్

» తప్పని అదనపు భారం



భవనాసి లోలెవల్ కాలువ నుంచి హైలెవల్ కాలువకు ట్రాక్టర్‌ల పంప్‌సెట్‌ల ద్వారా పంపింగ్ చేస్తున్న నీరు

అద్దంకి, ఫిబ్రవరి 26: భవనాసి ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పటం లేదు. భవనాసి చెరువు పరిధిలోని ఆయకట్టులో సుమారు వెయ్యి ఎకరాలు ఉంది. పాత తూము, లోలెవల్, హైలెవల్ కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల జరుగుతుంది. సాధారణంగా సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల జరిగితే భవనాసి చెరువు నిండా నీరు ఉంటాయి. అయితే, ఈ ఏడాది సాగర్ ఆయకట్టులో సాగుకు నీటి విడుదల జరగలేదు. దీంతో భవనాసి చెరువులో నీరు కూడా రోజురోజుకు తగ్గిపోతుంది. దీంతో హైలెవల్ కాలువకు నీరు పారుదలకు నిలిచిపోయింది. భవనాసి నీటిని నమ్ముకొని రైతులు హైలెవల్ కాలువ ఆయకట్టులో సుమారు 300 ఎకరాలలో మొక్కజొన్న, శనగ సాగు చేశారు.

మొక్కజొన్న పంటకు నీటి తడులు అవసరం కావటంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పటం లేదు. లోలెవల్ కాలువకు విడుదలవుతున్న నీటిని గోపాలపురం వద్ద హైలెవల్ కాలువకు ట్రాక్టర్‌లకు పంప్‌సెట్‌లు ఏర్పాటుచేసి పంపింగ్ చేస్తున్నారు. దీంతో రైతులకు అదనపు వ్యయం అవుతుంది. ఒక్కో ఎకరాకు నీటి తడుల కోసం సరాసరిన 5 వేల రూపాయల వరకు అదనపు భారం పడుతుంది. పంట చివర దశలో నీటి తడులు లేకపోవటంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉండటంతో అదనపు వ్యయాన్ని సైతం రైతులు లెక్కచేయకుండా నీటి తడులు పెడుతున్నారు.

ఎన్నికల కోడ్ రాకముందే పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

చినగంజాం, ఫిబ్రవరి 26: ఎన్నికల కోడ్ రాకముందే పనులు ప్రారంభించాలని ఎంపీడీవో యూబీ వరప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశానకి ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో జరిగే కార్యక్రమాల గురించి అధికారులు ప్రజాప్రతినిధులకు తప్పని సరిగా తెలియజేయాలన్నారు. ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ డ్యాంలలో నీరు తక్కువగా ఉన్నందున వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా వాడుకోవాలని చెప్పారు. గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో పైపులు లీకుల లేకుండా, నీటిని వృథా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు మాట్లాడుతూ కొత్తపాలెం, చినగంజాం-1,2, పెదగంజాం-1,2 సచివాలయల పరిధిలో సిమెంట్ రోడ్లు వేసేందుకు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.80 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. అయితే, టెండర్లు వేసేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదని తెలిపారు. ఇప్పటికి మూడు సార్లు టెండర్లు పిలిచినా ఎవరు టెండర్ వేయలేదని చెప్పారు.

పెదగంజాం గ్రామంలోని హిందూ శ్మశానాల్లో అడ్డుగా ఉన్న మొక్కలను తొలగించాలని ఏపీవో లక్ష్మీదేవికి ఎంపీపీ సూచించారు. శ్మశానాల్లో మొక్కలు తొలగించాలంటే గ్రామ పంచాయతీలో తీర్మానం చేయాలని ఏపీవో సమాధానం ఇచ్చారు. మార్చి 8న మండల పరిధిలో జరిగే మహాశివ రాత్రి తిరునాళ్లకు పరిసర గ్రామాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో ఖర్చు చేసిన నిధులకు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కాటుకూరి బాబురావు, టి.ప్రసన్నలక్ష్మి, పలుశాఖల అధికారులు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్ శివప్రసాదరావు, తదితరులు

చీరాల, ఫిబ్రవరి 26: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ అన్నారు. సోమవారం అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లలో పునరాభివృద్ధి కింద చేపట్టిన నూతన నిర్మాణాలను, ఆర్‌వోబీలను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. చీరాల రైల్వే స్టేషన్‌లో చేపట్టిన నూతన నిర్మాణాలు కూడా అందులో భాగంగా ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్ శివప్రసాదరావు, స్థానిక స్టేషన్ మేనేజర్ సింగయ్య తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, సదుపాయాలను వివరించారు.

ముందుగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, పలువురు బీజేపీ నాయకులు, స్టేషన్ అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

నేడు స్వామివారిని అభిషేకించనున్న సూర్యకిరణాలు

పంగులూరు, ఫిబ్రవరి 26: మండలంలోని చందలూరు గ్రామంలోగల శ్రీభూనీలా చెన్నకేశవస్వామి దేవస్థానంలో మూలవిరాట్‌ను సూర్యకిరణాలు అభిషేకిస్తాయని ఆలయ అర్చకులు రఘునాధాచార్యులు తెలిపారు. సౌరమానం అనుసరించి ఎప్పటిలాగే ఈ నెల 27, 28 తేదీలలో ఉదయం 6.30 నిముషాల నుండి 6.50 నిముషాల వరకు ఆలయ మూలవాట్‌ను సూర్య కిరణాలు అభిషేకిస్తాయని తెలిపారు.

భక్తులు ఈ అపురూప దృశ్యాన్ని తిలకించి తరించేందుకు ఏర్పాట్లుచేస్తున్నట్లు అర్చకస్వామి తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా లక్ష్మీకుమారి బాధ్యతల స్వీకరణ

చినగంజాం, ఫిబ్రవరి 26: చినగంజాం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బొప్పన లక్ష్మీకుమారి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న లక్ష్మీకుమారి డిప్యుటేషన్‌పై చినగంజాం వచ్చారు. చినగంజాం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.సుబ్బారావు డిప్యుటేషన్‌పై జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీకుమారిని కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 26 : కళాశాల స్థాయి నుంచే విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి ఉన్నతులుగా ఎదిగి సమాజ సేవలో భాగస్వాములు కావాలని వీకే జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎం శ్రీధర్ అన్నారు. స్థానిక వీకే జీజేసీ కళాశాల 46 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ అధ్యక్షతన సోమవారం జరిగిన వేడుకల్లో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు ప్రపంచం గర్వించదగ్గ స్థాయిలో ఉన్నార న్నారు. ఉన్నత శిఖరాలు అధిష్ఠించిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. మార్చిలో జరుగనున్న ఇంటర్ పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై.గురవయ్య, పార్వతీబాయ్, కోటేశ్వరరావు, బి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

చిదంబరేశ్వరస్వామికి సూర్యకిరణాభిషేకం



చిదంబరేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

చినగంజాం, ఫిబ్రవరి 26: స్థానిక గంగాపార్వతి సమేత చిదంబరేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి లింగాకారాన్ని సోమవారం సూర్యదయ వేళ కొన్ని నిమిషాల పాటు భానుని లేలేత కిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ కార్తీక మాసం, శివుని పుట్టిన రోజు, మాఘమాసంలో సూర్య కిరణాలు స్వామి వారిని అభిషేకిస్తూ ఉంటాయని తెలిపారు. సోమవారం ఉదయం 7.05 గంటల నుంచి నాలుగు నిమిషాల పాటు స్వామి వారి లింగాకారాన్ని భానుడి కిరణాలు తాకినట్లు తెలిపారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యకిరణాలు స్వామి వారిని అభిషేకించే దృశ్యాన్ని భక్తులు తిలకించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పర్చూరు: పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలోని శ్రీషిర్డిసాయినాథ దేవాలయంలో సోమవారం ఉదయం 6.55నిమిషాలకు స్వామివారి పాదాలను సూర్యకిరణాలు తాకాయని దేవస్థాన అర్చకులు నారాయణం సమీర్ కుమార్ తెలిపారు. ఈసూర్యకిరణాలు దక్షిణాయానం అక్టోబర్‌లో, ఉత్తయాణం ఫిబ్రవరి మాసంలో స్వామివారి పాదాలను తాకుతాయని ఆయన తెలపారు. సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకటంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పంగులూరు, ఫిబ్రవరి 26: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా సెక్టోరియల్ అధికారిని కుమారి సోమవారం పలుగ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీ లించారు. మండలంలోని తూర్పుతక్కెళ్ళపాడు, కొప్పెరపాడు, చందలూరు, నూజెళ్ళపల్లి గ్రామాలలోని 9 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా గ్రామాలలో పోలింగ్ సందర్భంగా తలెత్తే శాంతిభద్రతల సమస్యల గురించి స్థానికులతో చర్చించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల గురించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో బాపయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

5న చినగంజాంలో ఆత్మీయ సమావేశం

చినగంజాం, ఫిబ్రవరి 26: స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో మార్చి 5వ తేది సాయంత్రం 4గంటలకు బాపట్ల పార్లమెంట్ స్థాయిలో బీసీ, టీఎన్‌టీయూసీ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ బీసీ యాదవ సాధికార సమితి జిల్లా కన్వీనర్ నక్కల వీరరాఘవులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో సోమవారం టీడీపీ బీసీ మండల అధ్యక్షుడు వాటుపల్లి ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన టీఎన్‌టీయూసీ సభ్యులు, బీసీల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు, కార్మికులు ఎదుర్కొంటున సమస్యలపై ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు టీఎన్‌టీయూసీ పర్చూరు నియోజకవర్గ అధ్యక్షుడు నరహరి శ్రీనివాసరావు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కార్మికులు పడుతున్న ఇబ్బందులు, బీసీల సమస్యలను టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ పర్చూరు నియోజకవర్గ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు దండుప్రోలు తిరుపతిరావు, కె.రామాంజనేయులు, కె.విష్ణు, కె.రాముడు, సంఖ్యా శ్రీను, షేక్ జిలాని పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 26: ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ సచివాలయం-1 వద్ద, వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ వద్ద సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ లబ్ధిదారులు, గ్రామస్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యతాక్రమంలో దాదాపుగా పూర్తి చేస్తున్నామన్నారు. అర్హత ఉండీ సంక్షేమ పథకాల ఫలాలు అందనివారు ఎవరన్నా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

ఇంకొల్లు, ఫిబ్రవరి 26: మండలంలోని అన్ని ప్రయివేటు పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసినట్లు ఎంఈవో రామవరావు తెలిపారు. అర్హులైన తల్లిదండ్రులు మార్చి 14లోగా సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంబంధిత పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.1.44 లక్షలలోపు ఉన్నవారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదో తరగతి పరీక్షలను పక్కాగా నిర్వహించాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 26: పదో తరగతి పరీక్షలను పక్కాగా నిర్వహించాలని పరీక్షల ప్రత్యేక అధికారి కె.రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈవో నారాయణరావు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మార్చి 18 నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇందుకుసంబంధించి సోమవారం స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 18910 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. వీరిలో 9781 మంది బాలురు, 9129 మంది బాలికలు ఉన్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 108 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. అనంతరం మంగళవారం నుంచి సెయింట్‌ఆన్స్ కళాశాలలో జరిగే టెట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సుబ్రహ్మణ్యం, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత సెయింట్‌ఆన్స్ కళాశాల జట్టు



వాలీబాల్‌లో గెలుపొందిన జట్టుతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 26: నర్సరావుపేట ఈశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈశ్వర్ - 2024లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలలో వాలీబాల్ విభాగంలో సెయింట్‌ఆన్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు తదితరులు క్రీడాకారులను అభినందించారు. కళాశాల పీఈటీ అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ పోటీలలో పాల్గొన్న జట్ల వివరాలు, విజేతలకు అందిన సర్టిఫికెట్స్, మెడల్స్‌ను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అడ్మిస్ట్రేటివ్ మేనేజరు ఆర్వీ రమణమూర్తి, వివిధ విభాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వింతదూడ జననం

పంగులూరు, ఫిబ్రవరి 26: పంగులూరులో వింత దూడ జన్మించింది. సోమవారం మధ్యాహ్నం రెండు తలలు, 8 కాళ్ళతో పుట్టిన ఈ దూడ కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయింది. గ్రామానికి చెందిన రైతు రాయిణి వీరరాఘవయ్యకు చెందిన నెలలు నిండిన గేదె గర్భం నుంచి దూడ ఎంతకూ బయటకు రాకపోవడంతో పశువైద్యశాలకు వెళ్లారు. పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటం, డిప్యుటేషన్‌పై ఉన్న డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నిరాశతో ఇంటికి వచ్చారు. కొంత సమయానికి దూడ రెండు కాళ్ళు బయటకు రావడంతో కడుపులో పుట్టే దూడ అడ్డం తిరిగిందేమో అని భావిం చిన రైతులు బలంగా బయటకు లాగే ప్రయత్నం చేశారు. చాలాసేపటికి బయటకు వచ్చిన దూడకు రెండు తలలతో పాటు 8 కాళ్ళు ఉండటం చూసి విస్తుబోయారు. గర్భం నుంచి బయటకు తీసేక్రమంలో మృతి చెంది ఉంటుందని రైతులు తెలిపారు.